రసవిద్య
కవనశిల్పసమీక్ష

డా. సూరం శ్రీనివాసులు

రసవిద్య (కవనశిల్పసమీక్ష)

- డా. సూరం శ్రీనివాసులు

ఈ శాస్త్ర కావ్యం లో... పద్య కావ్య నిర్మాణ మర్మాల నుంచి మొదలుపెట్టి, ఆధునిక కథా నిర్మాణ సూత్రాల దాకా, ప్రాచీన కావ్య భాష నుంచిమొదలై, వర్తమాన వచనకవితాభాష దాకా ఆయా రంగాల్లో కృషిచేసేప్రతివారికి ఉపయోగపడే మార్గదర్శనాలు ఉన్నాయి..

– గంగిశెట్టి లక్ష్మీనారాయణ

పూర్వ ఉపకులపతి, ద్రావిడ విశ్వవిద్యాలయం, కుప్పం

ఈనాటి విమర్శకులు ప్రతిభ, శిల్పం, రసం, ఇతివృత్తం, అనుభూతి వంటి పదాల్ని యధేచ్ఛగా వాడి వాటి డెన్సిటీని తగ్గించేస్తున్నారు. ఇటువంటి సందర్భంలో కొందరు విమర్శకులు ఆలంకారిక శాస్త్రాల పేరుతో కలిగించిన భయాన్ని బద్దలుకొడుతూ కావ్యసౌందర్య శాస్త్రాన్ని గురించి కావ్యంలా రాసిన గ్రంథమిది.

– బూదాటి వేంకటేశ్వర్లు

ప్రొఫెసర్, బనారస్ హిందూ విశ్వవిద్యాలయం, వారణాసి

డాక్టర్ సూరం శ్రీనివాసులు గారు సరళ సుందరమైన పద్యాలలో అటు పండిత కవులకూ, ఇటు ఛాత్రకవులకూ సుబోధకమైన శైలిలో, కవితానుభవ సారముగా ఈ "రసవిద్య"ను విరచించి కవితాలోకానికి ప్రసాదించినారు. సుకవితకూ సుకవికీ ఉండవలసిన లక్షణాలనూ, ఉండకూడని లక్షణాలనూ సూక్ష్మంగా కూలంకషంగా బోధించినారు.

– చిటితోటి విజయకుమార్

హైదరాబాద్

ISBN
9 789356 592759

Price: Rs.120/-

రసవిద్య

కవనశిల్పసమీక్ష

డా. సూరం శ్రీనివాసులు

జయభాస్కర ప్రచురణలు

Publication No. PST05/05

రసవిద్య

డా. సూరం శ్రీనివాసులు

© సర్వహక్కులు రచయితవి

ISBN No: 978-93-5659-275-9

ప్రథమ ముద్రణ: **జూలై** 2022

పుటలు: 128

కాపీలు: 500

వెల: **₹ 120/-**

ప్రతులకు: డా. సూరం శ్రీనివాసులు
ప్లాట్ నం. 24, 4వ మైలు సెంటర్
షిర్డి నగర్, మసీదు దగ్గర,
నవలఖ్ గార్డెన్, నెల్లూరు – 524002
సెల్: 9440242348.

విట్టుబాబు, హైదరాబాద్, 8555082034.

Printed @
Jaya Bhaskara Printers
S3, 2nd Floor, 31 & 32, Road No.4, RKH colony
Dr. A.S.Rao Nagar, Hyderabad – 500062
Contact: 8555082034

లోనారయ

సారస్వత వరివస్య	*ఆచార్య గంగిశెట్టి లక్ష్మీనారాయణ*	*iii*
లోచూపు	*బూదాటి వేంకటేశ్వర్లు*	*xi*
కవితారసప్రేరణ	*చిటితోటి విజయకుమర్*	*xxvii*
నామాట	*సూరం శ్రీనివాసులు*	*xxix*

1. రసానుభూతి 1
2. కళాశిల్పము 7
3. కవితాశిల్పము 9
4. ఇతివృత్తం 11
5. ఎత్తుగడ 14
6. ముగింపు 17
7. కథనము 22
8. భాష 26
9. పదం 29
10. లయ 34
11. భావము 37
12. గుణదోషాలు 46
13. కవితాతత్త్వం 50
14. కవి - పాఠకుడు 55
15. నవకథాద్భుతి 58
16. కథ 65
17. నవల 67
18. కవితృష్ణ 69
19. కవినిష్ఠ 76
20. ఉపసంహారం 88

సారస్వత వరివస్య

– ఆచార్య గంగిశెట్టి లక్ష్మీనారాయణ
పూర్వ ఉపకులపతి, ద్రావిడ విశ్వవిద్యాలయం, కుప్పం

ప్రతిభా, పాండిత్యాలు రెండు కళ్లుగా కలిగిన వరిష్ఠ పండితకవి, కవి పండితులు, మీదుమిక్కిలి సహృదయతకు, సౌజన్యతకు నిలువెత్తు రూపం, డా. సూరం శ్రీనివాసులు గారు. సంస్కృతాంధ్రాలు రెంటిలోనూ, సమాన పాండిత్య గరిమ కలిగిన ఇటువంటి ఉన్నతస్థాయి విద్వాంసులతో ముడిపడి, వారి ప్రేముడి పొందడం 'సాహితీ సిరికోన' అదృష్టం.

ఖండాంతరాలలోని తెలుగు సాహిత్య అభిమానులు కొందరు కలిసి ఏర్పరచుకున్న వాక్స్థలి (వాట్సప్) వేదిక ఈ 'సిరికోన'. ఇది కేవలం ఒక సాహిత్యప్రియుల బృందం, వేదిక మాత్రమే కాదు; ఒక సాహిత్య దినపత్రిక వంటిది. డా.సూరం వారు కోనకు పరిచాయమయ్యాక, రోజూ అద్భుతమైన రసగుళికల వంటి వచనకవితలను పెడుతూ వచ్చారు. అంతదాకా వ్యాసభారత అనువాదకులుగా, సంప్రదాయజ్ఞులుగా, అవధానులనే తీర్చి దిద్దిన శతావధానిగా వారి కీర్తి మాలో ఎక్కువమందికి పరిచయం... కానీ వచన కవితా రూపానికే కొత్త పాఠాలు నేర్పేటంత విశిష్టంగా వచన కవితలు రాస్తారని తెలియదు. వారి వచన కవితల్లో పద్యం సొగసు ఉంది. భావవ్యక్తీకరణలో కవితాత్మక వచనపు తళుకు ఉంది. భావం - రూపం రెంటికీ ప్రాణంపోసే మానవీయప్రబోధం జీవ లక్షణంగా ప్రవహిస్తుంది. సిరికోన ప్రతి ఏటా ఇచ్చే, శ్రీమతి ఆసూరి సులోచనా స్మారక సిరికోన ఉత్తమ కవితా పురస్కారం ను 2021 కి గాను, వారి ఆ కవితల సంపుటి 'ఏటివాలు జ్ఞాపకం' కు అందించి సత్కరించే భాగ్యం ఇటీవలే మాకు లభించింది. అనతి కాలంలోనే అది తెలుగులో వెలువడ్డ ఉత్తమ మానవీయ కావ్యాల్లో ఒకటిగా పరిగణన పొందుతుందని నా నమ్మకం.

****

'సిరికోన'లో సాహిత్యానికి చెందిన అనేక విషయాలపై చర్చలు విశేషంగా జరుగుతుంటాయి... ప్రస్తుతం సాహిత్యం అన్ని సామాజిక ఉద్యమ యుగీన దశల్ని

దాటుకొని "సామాజిక-సాంకేతిక ఉద్యమ యుగం" లోకి అడుగుపెట్టింది... ఇవ్వాళ ఎందరు కవులున్నారో, అన్ని కవితారీతులు ఉన్నాయి; ప్రతికవీ తన కవిత్వం గురించి తానే చెప్పుకోవలసిన అగత్యం ఏర్పడింది కాబట్టి అన్ని కవిత్వసిద్ధాంతాలూ ఉన్నాయి... ఈ విస్తృతి మంచిదే కానీ, కవితాలక్షణాల 'ప్రాథమిక స్పృహ' విస్మృతి పాలవుతుండటమే విషాదం...

కవిత్వాన్ని కవిత్వంగా నిలిపే ఆ ప్రాథమిక లక్షణాలేమిటి?... తరచూ దీనిమీద అన్ని చోట్లా చర్చ జరుగుతున్నట్లే, సిరికోనలో కూడా చర్చ జరిగింది. ఆ నేపథ్యంలో, ఆకస్మికంగా "ఓ కవీ!" అంటూ సూరం గారి పద్యప్రబోధవాణి రోజూ సిరికోనలో వెలువడడం మొదలైంది. అది, అన్ని స్థాయిల - అన్ని వయో - వర్గ విభేదాల కవులకు మార్గదర్శకవాణిగా పరిణమిస్తూ రాసాగింది... అందులో లక్షణాల ప్రసక్తే కాదు, అవసరమైన చోట ఆధునిక విమర్శ కూడా ఉంది, వివరణ ఉంది. దాని వెనుక, దశాబ్దాల ఉత్తమ బోధనానుభవం ఉంది. అందులో అటు భరత - దండిల నుండి, ఇటు తిలక్ - ఆరుద్రల దాకా అందర్నీ సమన్వయించుకొనే "గుణం" ఉంది. చిన్న చిన్న తేటగీతుల్లో అటు రాజశేఖరుని నుండి ఇటు విశ్వనాథ వారి దాకా, వారందించిన స్వాదు రసాత్మిక భావ జలాల ప్రవాహం ఉంది. పూర్వ నిర్ణీత ప్రణాళిక అంటూ లేకుండానే, "ఏదొ మొదలిడి యెక్కడో చేది చేది/ కొన్ని చినుకుల నిక్కడ గురిసినాడ" అంటూనే, విస్పష్టమైన దార్శనిక దృష్టి ఆ పద్యధారలో ప్రతిఫలించింది. క్రమక్రమంగా అది ఒక "అభినవ శాస్త్ర కావ్యం" గా రూపుదిద్దుకొంది.

అదే ఇప్పుడు మన చేతుల్లో ఉన్న 'రసవిద్య'..

బహు కాలానికి రాజశేఖరుణ్ణి స్మరింప చేసే "శాస్త్ర కావ్యం".

****

'రసవిద్య' అంటేనే సాహిత్య విద్య! సాహిత్యశాస్త్రానికి మరో పేరు!

ఆ "రసవిద్య" అని పేరు పెట్టడంలోనే సూరం వారిలోని 'రసవత్కవి', ఆ కవిని నడిపించే సాహిత్య 'దర్శన వేత్త' మనకు సుపరిచితం అవుతున్నారు! ఇక వారి కృతికి మరో పరిచయం కావాలా? ఎంత రాసినా, అది సమగ్ర పరిచయమౌతుందా!?

****

సనాతన భారతీయ విద్యా సాధనల్లో, అత్యంత గరీయసమైంది, ఆధ్యాత్మిక విద్యా సాధన.... తత్త్వశాస్త్రం అంచులను ప్రపంచానికి పరిచయం చేసిన మహోన్నత సాధన!

తత్త్వశాస్త్రం అంచులు చూసిన వారికి, భౌతికశాస్త్ర సాధనలు తెలియవనడం అర్థరహితం. అయితే అవి భౌతికమైనవి కాబట్టి, నాగరికతలు నాగరికతలనే మింగేసిన కాలవైపరీత్యానికి గురై, కాలగర్భంలో కలిసిపోయాయి. ఆధిభౌతిక విద్య జగదీశ్వర తత్త్వంతో ముడిపడి ఉన్నది కాబట్టి, మానవుని భక్తిశ్రద్ధల నిత్యానుష్ఠానంతో, మనన చింతనాదులతో ముడిపడినది కాబట్టి, ఆ భక్తి శ్రద్ధల కారణంగానే మౌఖిక పరంపరలో అవిచ్ఛిన్నంగా కొనసాగుతూ వచ్చింది.. చిత్రమేమిటంటే, ఈ ఆధ్యాత్మిక విద్య పందిట్లోనే ఇతర భౌతికశాస్త్ర విద్యల మూలసూత్రాలు కూడా తీగలల్లుకొన్నాయి. అంగారకునికి సంబంధించినవైనా, శృంగారానికి సంబంధించినవైనా! దరిమిలా మనకు దక్కిన సనాతన భారతీయ విజ్ఞానం, ఒక భౌతిక - ఆధిభౌతిక / ఆధ్యాత్మిక విజ్ఞాన సంపుటి. జాగ్రత్తగా దాన్ని విప్పుకొని గ్రహించాల్సిన సవాలు ప్రతితరం ఎదుటా ఉంటోంది.

సనాతన భారతీయ విజ్ఞానం సాధించిన మరో మహత్తర సాధన- 'రసవిద్య'! పైన పేర్కొన్న ప్రాచీనుల "భౌతిక - ఆధిభౌతిక" విజ్ఞాన సంపుటికిది పరమోత్కృష్ట ఉదాహరణ. సాహిత్యమంటే సమగ్ర జీవితానికి అభివ్యక్తి. ఉన్న జీవితానికీ - ఉండదగ్గ జీవితానికి సమగ్ర అభివ్యక్తి! ఆ సమగ్రతకు మరోపేరే సౌందర్యం. సౌందర్యమంటే సృజన లోని పొందిక, సమత్వం, harmony.. అది ఈశ్వర సృజన అయిన చరాచర ప్రకృతి కావచ్చు; మానవ సృజన అయిన కళాప్రకృతి కావచ్చు! ప్రకృతి ఈశ్వర సృజనమైతే, ఆ ప్రకృతిని తన జీవనానికి అనుకూలంగా మార్చి దిద్దుకొన్న మానవ సృజనం, 'సంస్కృతి'. దాని ఉద్దీపక అభివ్యక్త రూపమే కళ! సమస్త కళలలో అతి సమగ్ర అభివ్యక్తి నిచ్చే కళ - సాహిత్యం. కనుక 'రసవిద్య' అంటే బ్రతుకు లోహాన్ని బంగారంగా మార్చి చూపే సాహిత్యకళావిద్య! జీవనకళా సౌందర్యశాస్త్రవిద్య!

రసమే సౌందర్యం. సౌందర్యమే జీవన పరమావధి తత్త్వమైన 'ఆనందా'నికి ప్రతి రూపం! సృష్టి సమస్తం ఈశ్వరుని సౌందర్య కళావిలాసం!! కనుకనే ప్రాక్పశ్చిమ తత్త్వశాస్త్రవేత్తలు, సౌందర్య శాస్త్రం (aesthetics) ను అన్వర్తిత (applied) తత్త్వశాస్త్రంలో అతి ముఖ్యశాఖగా లెక్కించారు..

"ప్రాగ్విపశ్చిన్మతమున ..... రసము వేయిరెట్లు గొప్పది..." అంటారు విశ్వనాథ వారు. వేదవాక్కు వంటి మాట అది... అయితే పాశ్చాత్యుల్లో మాత్రం "రసము" నకు సమానమైన భావనే లేదు. ఆ ఆధ్యాత్మిక భావన ముడిని చూసే తత్త్వ దృష్టి వారికి లేదు. అది కేవలం సనాతన భారతీయులకే ప్రత్యేకమైన దర్శనం.

రసాన్ని సూరం గారు ఇలా నిర్వచిస్తున్నారు:

సృష్టి సంభవమే పరమేశకాంక్ష
భవ్యసౌందర్యదర్శనప్రాప్తికొఱకు
దాన స్పందించు నెడద సంతసముకొఱకు
దాని కొక గొప్ప పేరు; తత్పదమె రసము

నాలుగే నాలుగు పంక్తుల్లో ఆ దివ్య దర్శనాన్ని సూత్రబద్ధం చేశారు...

సాధారణంగా సూరం గారి తేట గీతుల్లో రెండు 'దళాలు' ఉంటాయి. మొదటి దళంలో 'సూత్రం' ఉంటే, రెండో దళంలో వివరణ-'వృత్తి'- ఉంటుంది. లేదా మొదట వృత్తి వస్తే తర్వాత సూత్రం వస్తుంది. ఇందులోనూ అంతే! మొదట సాధారణ లోక ప్రసిద్ధసూత్రం: పరమేశునికి సృష్టిని "సంభవింప" చేయాలనే "కాంక్ష" కలిగింది... ఆ సంభవించే సృష్టి, సుందరంగా ఉండాలనే ఆకాంక్షా కలిగింది. (భాగవతం ప్రకారమైతే, బ్రహ్మదేవుడు ఏడు మార్లు ఎక్స్పెరిమెంట్ చేశాడట, ఆ 'భవ్యత'కు ఈ మాత్రం సౌందర్యం ప్రాప్తించడానికి !)...ఇంతదాకా మార్మికత. పరంపరాగత మార్మిక సూత్రం!

తర్వాతి దళంలో వాస్తవిక వివరణ. ... సౌందర్యం వల్ల జీవుడిలో కలిగే 'స్పందన' వివరణ. స్పందన అనేది సర్వ జీవ లక్షణం; దాన్ని రేకెత్తించేదే సౌందర్యం. దాని గమ్యం 'సంతసం', ఆనందం. అదే మానవుని అతి గరిష్ఠ అనుభవం. అవ్యక్తమైన ఆ గమ్య సాధనకోసమే మానవ జీవన ప్రయాసలన్నీ! ఈ జీవుడి కథలన్నీ!!

ఆ తర్వాతి పాదంలో ఎంత తేలిగ్గా, అదే సమయంలో ఎంత చిక్కగా, అంటున్నారో చూడండి: " దాని కొక గొప్పపేరు; తత్పదమె రసము"....

ఇక్కడ పదమంటే? శబ్దమనా? అవును.... కాదు... మానవుడు అందుకునే అతి గొప్ప స్థాయి, దశ. బ్రహ్మానంద పదానికి తుల్యమైన స్థాయి! అలవోకగా పడ్డ ఆ శ్లేషతో పద్యం స్థాయే మారిపోయి, సూత్రానికి తగ్గ సంపూర్ణ తాత్త్విక గంభీరత చేకూరింది.

తాత్త్వికత/ మార్మికత అయితే బాగుంది. దాన్ని అలా గ్రహించటానికి ఆధునిక చేతన ఒప్పుకోదే! మరి లౌకిక భావాతీతమైన 'రస' భావనను ఎలా ఆకళింపు చేసుకోవటం?

****

రసాన్ని మనం ఇవ్వాళ మూడు దృక్కోణాల నుంచి చూస్తున్నాము.

మొదటిది: పైన వివరించిన మార్మిక దృక్కోణం. 'రసో వై సః' అని భక్తితో స్మరించటం! అన్వయ వివరణల ప్రసక్తి లేదు, ఔదల దాల్చటమే!.. మహా అయితే బ్రహ్మానంద సదృశం అని సమాధిగత స్థితిలో అనుభవించటమే!

రెండవది: భావ నైర్మల్య సాధన దృక్కోణం... భావాలు లౌకికాలు.. వాటికి అతీతమైన - అంతరంగ శుద్ధి తోని - భావాతీత అనుభవం రసం. ఇందులో సహజ భావ వికారాల నుంచి ప్రాకృతిక మానవుడు, సమున్నతుడై సాధించే నిర్వికార, లేదా, సుసంస్కృత స్థితి ఉంటుంది... భరతుడు చెప్పినది ఇదే అని నా నమ్మకం. భరత ప్రోక్తమైన దృక్పథాన్నే, భారత దేశం నుంచి అలెగ్జాండర్ తన వెంట పట్టుకువెళ్లిన దేశికులనుంచి గ్రహించి, అరిస్టాటిల్ తన దేశ - కాలానుగుణమైన వాస్తవిక దృక్పథంతో దాన్ని మార్చి, Catharsis (- భావ శుద్ధీకరణ -) పేరిట ప్రపంచించాడని నా విశ్వాసం. భరతుని కాలం విషయం అడ్డు వస్తుంది అంటే, పెద్దలిప్పటికి చేసిన కాల నిర్ణయం సమంజసం కాదని నా భావన. ఒకవేళ ఆయన క్రీస్తుకు ఒక శతాబ్ది ముందో, వెనకో ఉన్నవాడనుకొంటే, భరతర్షి అనుసరించిన దృక్కోణం ఆయనే పేర్కొన్న అంతకు మునుపటి లాక్షణికుల దృక్పథం అయ్యే అవకాశం ఉంది.

ఇక మూడవది: ఇప్పటి వారలు తరచూ వాడే 'అనుభూతి' సిద్ధాంత పరమైంది. రమ్యాంతిక (రొమాంటిక్) యుగంలోని పాశ్చాత్యులు అందించిన "ఎంపతీ" "సౌందర్యానుభవం" సిద్ధాంతాలు రెంటినీ, ప్రాచీనుడైన లాంజినస్ "సబ్లైమ్" సిద్ధాంతంతో కలిపి, మన నవ్యులు స్వచ్ఛందంగా రూపొందించుకొన్న నవ్య కాల్పనిక సిద్ధాంతం ఈ "అనుభూతి వాదం". గత మూడు నాలుగు దశాబ్దాల నుంచి తెలుగున రాజ్యమేలుతోంది..

ఎందుకు వీటిని ఇంతగా విపులీకరించానంటే, ప్రాచీనులలో ప్రాచీనుడు, నవ్యులలో నవ్యుడూ అయిన సూరం మేష్టారు ఈ మూడు దృక్పథాల సమన్వయంతో రస-

అనుభూతి సిద్ధాంతాన్ని వివరించారు. నిజానికి వారు మొదట రసం మీద విడిగా ప్రకరణం - లేదా - కావ్య ఖండికను రాయలేదు. అనుభూతి మీదనే రాశారు. రసాన్ని అనుభూతిగానే చెప్పక చెప్పారు...

'రసానుభూతి' ప్రకరణం లోని ఈ పద్యం చూడండి:

భావములు సహజాతముల్ వాసనాత్మ
కములు సహృదయ స్వాంత సంస్థములు సతము
కళల గాంచుట నుప్పొంగి కలక దీరి
రస్యమానములై యవి రసము లగును

పైన వివరించినట్లు ఈ పద్యంలో కూడా రెండు దళాలు ఉన్నాయి.

మొదటి దళంలో మూడు ప్రధాన శాస్త్రీయ అంశాలను పరిచయం చేస్తున్నారు:

1. భావాలు సహజాతాలు.

సహజం వేరు, సహజాతం వేరు. ప్రకృతి సహజమైనవి సహజాలు. పుట్టుకతో అవ్యక్త భావాలై పుట్టేవి సహజాతాలు. వీటినే ఇంగ్లీషులో instincts అంటాము. ఆకలి, ఆకలి అవుతుందనే దానికి సూచనగా ఏడుపు? వీటిని శిశువుకు పుట్టుకతో ఎవరు నేర్పుతారు? అవీ సహజాతాలంటే అని అంతకు మునుపటి పద్యంలో పరిచయం చేస్తారు. (ఆ పద్యంలో శిశువు నవ్వు గురించి చెబుతూ ఎంతో మనోహరంగా చెబుతారు. దాన్ని, అందులోని 'లాలనలన్' అనే పదం సొగసును మీరే చూసి, ఆ 'అనుభూతి' పొందండి!)

2. భావాలు వాసనాత్మకములు.

ఇది చాలా లోతైన తాత్త్విక వివరణను అపేక్షించే మాట.. దానికి ఈ ముందు మాట అనువైన చోటు కాదు... పాఠకులే గ్రహించగలరు.

3. ఈ సహజాతాలు+ వాసనాత్మకాలు అయిన భావాలు **"సహృదయ స్వాంత సంస్థము"** లై ఉంటాయట.... ఈ మాట లోతు తెలియాలంటే మనం కాళిదాసు "రమ్యాణి వీక్ష్య మధురాం శ్చ నిశమ్య శబ్దాన్" శ్లోకపు లోతును తమ "కావ్యానందము" లో వివరించిన విశ్వనాథ వారి పదాలను ఆశ్రయించాల్సిందే! అప్పుడే ఆ "స్వాంత సంస్థములు" లోతు సుబోధమవుతుంది...

ఇక తర్వాతి దళం:

సతతం కళలను చూడటం వల్ల, ఆ స్వాంతం లోని సహజ సంస్థితాలైన వాసనాత్మక భావాలు ఉప్పొంగి, మన రుచిని బట్టి, రస్యమానములై – ఆస్వాదనీయాలై – రసాలుగా మారుతుంటాయి.

ఇదీ వారి రస నిర్వచనం. లౌకిక భావాలు, అలౌకిక అనుభావ్య స్థాయికి చేరి, ఎలా 'రస్యమానాల'వుతున్నాయో, మెట్టు మెట్టుగా, వృత్తి సహితంగా ఇచ్చిన నిర్వచనం.

ఎంత వాస్తవిక దృక్పథంతో ఈ నిర్వచనం సాగిందో రసజ్ఞులకు వివరించ పని లేదు. ఇతరులకు ఇందులోని ప్రతి మాటను వ్యాఖ్యానించి చెబితే కానీ, దీని లోతు, దానివెనుక పరిణతి అర్థం కావు...

అసలు ఇలాటి "శాస్త్ర కావ్యం" సవ్యాఖ్యానంగా వెలువడితేనే సార్థకమౌతుంది.. తన రచనకు తానే వ్యాఖ్యానం రాయటం ఏ శాస్త్రకవికీ సమ్మతం కాదు. అందుకు సమర్థులైన ఇతరులు దొరకడమూ సులభం కాదు.. అలాటి స్థితిలో ఇప్పుడిది ఇలానే వెలువడుతోంది... భవిష్యత్తులో వ్యాఖ్యాసహిత ప్రచురణ వస్తుందనే నమ్మకముంది...

ఇప్పటి మన సాహిత్య శాస్త్ర అధ్యయనం, ఎప్పుడో ఆంధ్రవిశ్వకళాపరిషత్తు ఏర్పడిన కొత్తలో పింగళి గారు, హడ్సన్ 'లిటరరీ క్రిటిసిజం' మీద రాసిన నోట్సు వంటి పుస్తకాన్ని చూసి ఏర్పరచుకొన్న ప్రణాళిక ('సాహిత్య శిల్ప సమీక్ష' ప్రణాళిక) ననుసరించే సాగుతున్నట్టిది... అందులో లేని, సమకాలీనంగా అందరి దృష్టినీ ఆకర్షించే అనేక ఆధునిక విషయాలు, ఈ శాస్త్ర కావ్యం లోని 20 ప్రకరణాల్లో ప్రస్తావితమై ఉన్నాయి... పద్య కావ్య నిర్మాణ మర్మాల నుంచి మొదలుపెట్టి, ఆధునిక కథా నిర్మాణ సూత్రాల దాకా, ప్రాచీన కావ్య భాష నుంచి మొదలై, వర్తమాన వచనకవితాభాష దాకా ఆయా రంగాల్లో కృషిచేసే ప్రతివారికి ఉపయోగపడే మార్గదర్శనాలు ఉన్నాయి.. సూత్రాలు, వివరణలూ కాదు; వాటి విమర్శలున్నాయి. సుమారు నాలుగున్నర దశాబ్దాల పాటు ఎందరో ఉత్తమ విద్యార్థులకు విడమరిచి చెప్పిన అనుభవ పాఠాలున్నాయి... ఎన్నో నవీన ప్రశ్నలకు ప్రాచీన సమాధానాలు, ప్రాచీన ప్రశ్నలకు నవీన సమాధానాలు ఉన్నాయి....

చివర ఉపసంహారంలో సూరం వారన్న ఈ మాట చూడండి:

ఒరులడిగిన జెప్పనిచో
నరకమ్మున బడు నటంచు నన్నయ పలికెన్
బరులడుగకున్నఁ జెప్పిన
బరిణతి ఫలమేమి యగునొ? పలికితి నైనన్

ఒక గొప్ప అధ్యాపకుడుగా ఆయన కర్తవ్యం ఆయన నన్నయ స్ఫూర్తితో, గీతాశాస్త్ర స్పృహతో, పూర్తి చేశారు. 'అయినన్' అని అర్థోక్తిలో పద్యం నిలిపి, పరోక్షంగా కాల స్వభావాన్ని చూసి నిట్టూర్చారు.. అయినా సాహిత్య విద్యాబోధన సాగుతున్నంత కాలం ఈ పరిణత వాణి ప్రయోజనం ఉంటుంది... దశాబ్దాల పూర్ణానుభవం నిండిన ఈ "అభినవ సాహిత్యశాస్త్ర కావ్య" పూర్ణ ప్రయోజనం సిద్ధించాలంటే, దీని ప్రయోజనం నేటి విద్యార్థిలోకానికి పూర్తిగా అందాలంటే, సమర్థుడైన ఏ పుణ్యాత్ముడో పూనుకొని దీనికి వ్యాఖ్యను వెలయించాలి. ఆ పుణ్యవేళ కూడా త్వరలో వస్తుందని నా నమ్మిక...

- గంగిశెట్టి లక్ష్మీనారాయణ

❖

లోచూపు

(ఈ రస విద్యను గురించి నేను రాసుకున్న నోట్సు)

– బూదాటి వేంకటేశ్వర్లు

ప్రొఫెసర్, బనారస్ హిందూ విశ్వవిద్యాలయం, వారణాసి

ఆధునిక కాలంలో రాయప్రోలు వారి తర్వాత కావ్య సౌందర్య శాస్త్రాన్ని ఇలా పద్యరూపంలో చెప్పినవారు లేరు. విశ్వనాథవారి 'కావ్యానందం', శేషేంద్రశర్మగారి 'కవిసేనమేనిఫెస్టో' ఆధునిక అలంకార శాస్త్రాలని చెప్పదగిన వచన రచనలు. విశ్వనాథవారి కావ్యానందం శాస్త్రపరిభాషను ఏమాత్రం ఉపయోగించకుండా చేసిన మౌలిక వివేచన. ఎంతోమంది కవిత్వతత్త విచారం దగ్గరి నుండి విమర్శకు దోహదం చేసే అనేకాంశాలను భారతీయ ఆలంకారిక శాస్త్రాలకు అనుకూలంగాను, వ్యతిరేకంగాను, గ్రంథరూపంలోనూ, వ్యాసాల రూపంలోను వ్రాస్తూ వచ్చారు. రవీంద్రుడు, అరవిందుడు వంటివాళ్లు కావ్యాలను గురించి వెలుబుచ్చిన అభిప్రాయాల్ని తెలిపే వ్యాసాల్ని ఆంగ్ల సాహిత్య విమర్శకుల అభిప్రాయాల్ని ఇబ్బడిముబ్బడిగానే అనువదించి మనకిచ్చారు. నాగరికతలో, సంస్కృతిలో భాగమైన ఒక జ్ఞానాంశాన్ని తమ విశ్లేషణతో అవగాహన కలిగించవలనసిన బాధ్యత విమర్శకునిది. అదిగో అటువంటి విశిష్ట ప్రయత్నాన్ని కావ్యనిర్మాతయైన దేశికులు, ప్రాచీన నవీన కవితామర్మజ్ఞులు, సముదాత్త సారస్వత సేవాధర్మజ్ఞులు, సౌమనస్య మూర్ధన్యులు, అసామాన్య ధీమాన్యులు, మాకు గురుతుల్యులు ఐన శ్రీసూరం వారు చేశారు.

ఈనాటి విమర్శకులు ప్రతిభ, శిల్పం, రసం, ఇతివృత్తం, అనుభూతి వంటి పదాల్ని యధేచ్ఛగా వాడి వాటి డెన్సిటీని తగ్గించేస్తున్నారు. లోతు తెలియకుండా ఇలా వాడటం వలన వాటికి అర్థవిపరిణామం కలిగే ప్రమాదం కూడా లేకపోలేదు. ఈ పారిభాషిక పదాలన్నీ వస్తులక్షణతత్త్వాన్ని, దర్శనాన్ని మోస్తూ రూఢియైన సంజ్ఞలు. Aesthetic Experience ను తెలిపే ఈ పదాలు, పరిభాషరూపంలో కలిగించే సౌకర్యాన్ని దుర్వినియోగం చేస్తున్నారు. ఇటువంటి సందర్భంలో కొందరు విమర్శకులు

ఆలంకారిక శాస్త్రాల పేరుతో కలిగించిన భయాన్ని బద్దలుకొడుతూ కావ్యసౌందర్య శాస్త్రాన్ని గురించి కావ్యంలా రాసిన గ్రంథమిది.

ఈ రసవిద్య బోధించటానికి వారి అర్హత **'విశాలరస ప్రపంచవిరించి'** - కావటమే. వివిధ సాహిత్య ప్రస్థానాల సర్వపరిజ్ఞానము వారి వచో విధేయం కావటమే. వారిని చూచినప్పుడు అభిజ్ఞానశాకుంతలంలోని **'స్ఫులింగావస్థయా వహ్నిరేధోఽపేక్ష ఇవస్థితః'** - అన్న ఆభాణకం గుర్తుకువస్తుంది. కావ్య నిర్మాణ సామగ్రిని గురించి వారు ఒక బోధకునిగా మనలను విద్యావంతులను చేయటానికి చేసిన ప్రయత్నమిది.

పాండిత్యమంటే ఊహల ఉడ్డీనత కాదు. భయంగొలిపే భూతమూ కాదు. ఊహల్ని కట్టుకొయ్యకు చేర్చేది పాండిత్యమే. అది కవికెంత అవసరమో, విమర్శకుడికి అంతే అవసరం.

"The advantage of good scholarship is that it presents us with good evidance which is an invitation to the critical faculty of the reader it best ows a method, rather than a Judgement"

- (T.S.Eliot, P.205, The second wood)

అదిగో అటువంటి పాండిత్యాన్ని పునాదిగా చేసికొని దానిపై నిర్మించిన సౌందర్యశాస్త్ర వివరణ గ్రంథమిది.

కట్టెల్ని కొట్టి కందిపోయిన చేతులు, పూలుగుచ్చి అలసిపోయిన చేతులు, పద్యాన్ని వ్రాసి పండిపోయిన చేతులు ఒకటేనని తెలిసి ముందడుగు వేయాలంటూ ప్రారంభించిన ఈ శాస్త్రకావ్యంలో రసానుభూతి, కళాశిల్పం, కవితాశిల్పం, ఇతివృత్తం, ఎత్తుగడ, ముగింపు, కథనం, భాష, పదం, లయ, భావము, గుణదోషాలు, కవితాతత్త్వం, కవి-పాఠకుడు, నవకథాదృతి, కథ, నవల, కవితృష్ణ, కవినిష్ఠ, ఉపసంహారమనే శీర్షికలతో రాసిన పద్యాలలో కవి విమర్శకులిద్దరూ అర్ధనారీశ్వరతత్త్వంతో పాఠకుల్ని ఆవర్జిస్తున్నారు. కవిత్వ సౌందర్య సూత్రాల్ని మేథాహృదయ సంసర్గంతో పాఠకులకు అందిస్తున్నారు.

ఒక నియమం వేరు, దాని లక్షణం వేరు. నియమానిది ఎప్పుడూ శాస్త్రలక్షణమే. కాని లక్షణం ఎప్పుడూ తత్త్వ వివేచనతోనే ముడిపడి ఉంటుంది. అటువంటి కావ్యతత్త్వ

వివేచన చేసే ఈ గ్రంథంలో అడుగడుగునా మతికి విభ్రమం కలిగించే ఉపమలు కనిపిస్తాయి. బంగారం కోసం ఇసుక జల్లెడ పట్టేవాడు, శిల్పం కోసం రాళ్ళను బద్దలు కొట్టేవాడు, కుండీల కోసం మట్టిని చేతులతో నొక్కేవాడు అందరూ శిల్పపారగులేనని శిల్పం గురించి చెపుతూచెపుతారు.

క॥ ఒక జోలపాట పాడుచు
నొక లోకము సృష్టి చేసి యొకనిముసములో
నొకశిశువు బండ జేసెడి
యకలుష వాత్సల్యమూర్తి యమ్మయు గవియే" (కళా శిల్పము)

అమ్మ కూడా కవే. ఎందుకంటే మన కోసం ఒక లోకాన్ని సృష్టి చేసి, జోలపాట పాడుతూ నిముషంలో నిద్ర పుచ్చుతుంది. అందుకే అమ్మ కవి అని చెప్పిన ఈ పద్యాన్ని వ్యాఖ్యానించి చెపితే కవి లక్షణం చెప్పినట్లే.

1. ఒక లోకాన్ని సృష్టి చేసే నేర్పుండాలి.
2. సద్యః పరనిర్వృతిని కలిగించాలి.
3. అకలుషిత చిత్తముండాలి
4. తల్లి తన బిడ్డను ప్రేమించినట్లు తాను సృష్టించే కావ్యాన్ని ప్రేమించాలి.
5. అమ్మ జోలపాట పసివాడిని ప్రభావితం చేసినట్లు, కవి సృష్టించే కావ్యం లోకాన్ని ప్రభావితం చేయాలి.

అమ్మకు చెప్పిన లక్షణాన్ని కవికి అన్వయిస్తే చక్కగా సరిపోతుంది. మన అలంకారశాస్త్రాలు కవిని గురించి చెప్పిన వంద నిర్వచనాలు ఇలా సూరం వారి పద్యంలో అలవోకగా కుదురుకున్నాయి.

నైరూప్య భావాలకు మూర్తిమత్వాన్ని కల్గించటం, వాటికి మళ్లీ ఒక మనఃస్థితిని సృష్టించటం సూరంవారి సూరితనం. చినుకులు రాలే తీరులో మెలమెల్లగా చీకటి చిద్రుపలు కావటంలో విధాత కవితా తలపులు కనిపిస్తాయనటం, వరి నాటటంలో, తగిన సమయంలో కోసి పనలు తరలించటంలో, వరికుప్పలు తీర్చటంలో కవిత్వపు కూర్పు, నేర్పు కనిపిస్తుందని చెప్పటంలో ఎంతటి లోక పరిశీలనాశక్తియో, అంతటి అవగాహన కూడా!

కవితాశిల్పాన్ని గురించి చెపుతూ

సీ॥ సాలీటికుటినున్న సాధు నిర్మాతృత
చీమల పురిలోని సిద్ధకరత
కాకనీడమ్ములోఁ గనపట్టు పూర్ణత
తేనెపట్టులలోని తీపి కొలత
తీరకుళీర సంచారపు వికటత
యలలకదలికల నలరు క్రమత
నిండు కుండనుదోచు నిర్భర రసవత్త
ఖేచరగమన సంకీర్ణసమత

తే.గీ. కలసియల్లికలై దివ్యకాంతి మెఱసి
యలరఁ జేయుచు నెడదల యందు నిలిచి
తోటివారికి నడియేటి బాటయగుచు
సాగఁగావలె స్వీయ సంస్కార కవిత (కవితా శిల్పం)

అంటూ చెప్పిన ఈ పద్యం కంటే కవితాశిల్పాన్ని చెప్పటానికి ఏముంటుంది. ప్రతిభను ప్రయోజనవంతంగా తీర్చేది, దానికి ఘనతను సమకూర్చి పెట్టేది శిల్పమే. కేవలం ప్రతిభకు వ్యుత్పన్నతను జోడించటమే శిల్పమనుకుంటే పొరపాటు. అది ఎలా సహజసిద్ధంగా సమకూరాలో చెప్పిన ఈ కవితాత్మక పంక్తుల వ్యాఖ్యానం కావ్యరచనా మార్గ వర్తనులకు ఒజ్జపంక్తి.

సద్యః పరనిర్వృతి, అవ్యక్తమధురిమ, సౌందర్యం వంటి విషయాలను గురించి పూర్వం ఆలంకారికులు, దార్శనికులు చెప్పిన అంశాలనన్నీ జీర్ణించుకుని, గబ్బున త్రేన్చినట్లు తనదైన అనుభవ ముద్రతో చెపుతారు సూరం వారు.

సౌందర్యాన్ని ఆనందానికి అభివ్యక్తిగానే చూసిన అరవిందుల వలె సూరం వారు-

ఆ.వె. ప్రాణమొక్క చోట వ్యానమ్ము సర్వత్ర
నిలిచి దేహయష్టి నిలుపునట్టు
లందమొక్క చోట నాభిరూప్యమునెల్ల
నిలిచి కథను గవిత నిలపవలయు (కవితా శిల్పము)

- అని సౌందర్యాన్ని వ్యాఖ్యానించి చెపుతారు. ప్రాణ - అపాన - వ్యాన - ఉదాన – సమానమనే పంచప్రాణాలలో ప్రాణవాయువు హృదయ స్థానంలో, అపానవాయువు మూలాధారంతో, సమానవాయువు నాభితో, ఉదానవాయువు కంఠంలో, వ్యానవాయువు దేహమంతా ఉంటుందని మన భారతీయవైద్యక పరిభాష.

కవితకైనా, కథకైనా ఆనందం ప్రాణ సదృశం. ఆ ఆనందాన్నిచ్చే సౌందర్యాన్ని ఎక్కడో ఒకచోట నిలిపినప్పటికీ, దాని ఆభిరూప్యం సర్వత్రా ప్రకాశించాలని సూరం వారు చెపుతారు.

"ప్రాగ్విపశ్చిన్మతంబున రసము వేయి/ రెట్లు గొప్పది నవకథా దృతినిమించి" అని విశ్వనాథ వారంటే, సూరం వారేమో ప్రఖ్యాత కథను స్వీకరిస్తే మెప్పించటం కవికి సులభం కాదని అంటారు. పాత్ర నిర్మాణ విషయంలో కల్పనలెన్ని చేసినప్పటికీ పాత్ర సహజ ప్రవృత్తిని కాపాడాలని చెపుతారు. చారిత్రక కావ్యరచనలోని కష్టాల్ని గురించి చెపుతూ ఆధారాలు తగినంతగా లేనిచోట కల్పనలు చేయటం కుదరదు. ఊహామేర చేయటం సాహసమవుతుంది.

"రాజ్యములనాక్రమించిన రాజు చరిత
హద్దు రాళ్లను జరిపిన యతడు దొంగ" (ఇతివృత్తం)

వీటిలో ఏది ఆదర్శమో తెలిసి రాయాలని చెపుతాడు. వ్యవస్థ వ్యక్తికంటే వేనవేల రెట్లు పెద్దది. దానిని గుర్తించి, కథను వ్యవస్థాపకంగా తీర్చినపుడే ఇబ్బడి ముబ్బడి ప్రయోజనమని చెపుతారు సూరంవారు.

కావ్యానికి పెట్టే పేరు కూడా వక్రోక్తిలో భాగంగానే మన ప్రాచీనులు భావించారు. వర్తమానంలో సైతం శక్తి గల రచయిత శీర్షంలో నుండి వెలువడే శీర్షికలు తద్భిన్నంగా ఏమీ లేవు. ప్రాచీనాలంకారికులు చెప్పిన కృత్యాద్యవస్థ కేవలం ఎక్కడ మొదలు పెట్టాలి?, ఎలా ప్రారంభించాలి? అన్న దగ్గరే ఆగిపోదు. కథాసంవిధాన శిల్పవివేచన చేయిస్తుంది. కావ్యమైనా, కథయినా అది వర్తిస్తుంది. కథ ఎత్తుగడ సందర్భంలోని మనఃస్థితే పద్యాన్ని ప్రారంభించటానికి చేసే యత్నంలో కూడా కనిపిస్తుంది.

కేవలం ఎత్తగడతో బతికిన పద్యాలు, వచన కవిత్వపు పంక్తులు ఎన్నో! సూరంవారేమంటారంటే, సహజసిద్ధమైన భావనిర్మాణంతో కూడిన ఎత్తుగడ, ముగింపులు రెండూ ప్రాణ సదృశమైనవేనంటారు. పద్యంలో కంటే వచన కవిత్వానికే ఈ

ఎత్తుగడ పట్ల శ్రద్ధ అవసరమంటారు. ఎత్తుగడతో విచికిత్స నింపి, ఔత్సుక్యస్ఫోరకంగా రాస్తూ, ముగింపులో ఆ ఉత్కంఠను ఉపసంహరించేలా రాస్తే ఆ వచన కవితకు రమణీయతతోపాటు రాణింపు ఉంటుందని చెప్పటంలో వచన కవిత్వాన్ని దాని నిర్మాణరీతిని వివరించినట్లు.

ముగింపును గురించి సూరంవారు రాసిన ప్రతిపద్యము ఒక ఆలంకారికుడు చెప్పిన లక్షణ నిర్దేశంలా కనిపిస్తుంది. **'మంగళాంతాని కావ్యాని'** - అన్న లక్షణం భారతీయులది. ఎన్ని ఒడిదుడుకులెదురైనా, వాటిని దాటుకుని బ్రతుకు పండించుకోవటమే ఆశావహంకాని, ప్రత్యాశతో మరణం పాలవటం మానవ కోటికి ఆదర్శం కాదు కదా! కాని విషాదాంతాలను ఆధునికకాలంలో కవులు మన్నిస్తున్నారు. ఈ విషాదాంతం మన మనఃస్థితిలో కలిగించే ముద్ర ఎలాంటిది? ఈ కరుణ రసాన్ని గురించి మాస్టారు చెప్పిన విషయం గమనించండి.

'ఆకాశమంత ఎత్తులో ప్రజల హృదయాల్లో నాటుకొన్న చిత్త సంస్కారమది. అది జాలిగుండెలలో పుట్టి ప్రవహించాలే గానీ, విషాదాన్ని భరించే వ్యవహారం కాదని' చెపుతారు. ఇది కెథార్సిస్‌ను బాగా డైజెస్ట్ చేసుకుంటే తప్ప చెప్పలేని పంక్తులు.

ఏ రచనలోనైనా ఆరంభం నుండి చివరిదాకా వచ్చే పాత్రలు, సంఘటనలు, సార్థకం కావాలి. ముడులు విడదీసి, తగు సమాధానాలు చెప్పాలి. ఆమనిలో ఒలికిపడిపోయిన తేనెచుక్క తీయదనం ఎక్కడికి చేరిందో చెప్పాలి? మన బ్రతుకులాగే దాని జన్మకూడా ధన్యమయ్యే విధం చెప్పాలి. తాను చూపే పరిష్కారం తన సమాజానికి కూడా సమమార్గ దిక్సూచి కావాలి. తాను తలపెట్టిన ముగింపు తనకే కాదు, తాను సృష్టించిన పాత్రలకు కూడా నచ్చేలా అనిపించాలి. హేతుబద్ధత ఉండాలి. అది

పుడమి రాలిన చినుకులు పులకరించి
మొలకలో దూరి మానులై మురిసినట్లు (ముగింపు) గా ఉండాలి.

ఒక విలక్షణ దర్శనమొక తెగింపు
నొకవిలక్షణ భావనమొక బిగింపు
నొక విలక్షణ బంధనమొకలగింపు
నొక విలక్షణ కవితకు నొకముగింపు (ముగింపు)

- ఇది కావ్యానికైనా, ఖండికకైనా సూరం వారిచ్చే తీర్పు.

ఒక కవితను చదివినపుడు పాఠకుల స్వాంతాలు బండలాగుడు పోటీలలా ఉండకూడదంటారు. మరెలా ఉండాలంటే ***'గాలివాలున నేగు నౌకల విధాన'*** ఉండాలంటారు.

కావ్యంలోనైనా, నవలలోనైనా కథనం, సినిమాలో స్క్రీన్ ప్లే లాంటిది. కథ ఎంత గొప్పదయినా కథనం సరిగాలేకపోతే అది అదిరాతికి రాదు. ఈ విషయాన్నే సూరం వారు చెపుతూ

> ***ఆయుధములు గెలుపులందియిచ్చునె? యవి***
> ***వాడినపుడుగాక వాడి చేసి"*** - అంటారు.

ఆయుధానికి పదునెంత పెట్టినా, వాడకుండానే అది విజయాన్ని ఇస్తుందా? అలాగే కథనం బాగా లేకుండా కథకు వన్నె సమకూరదని చెపుతారు. కథనమెన్నిరకాలుగా చేయవచ్చో చెప్పి, అది ప్రాణికి శరీరంలోని లావణ్యంలాగా సర్వత్రా నిర్దుష్టతా నేత్రంతో ఉండాలని బోధిస్తారు. కవితకైనా, కవికైనా స్పష్టతయే లక్ష్యం కావాలని చెపుతారు.

భాష గురించి చెపుతూ "ఏ భాషా సమస్త మనోభావ వ్యక్తీకరణకు సమర్థం కాదు. జానపదుల సహజభాష మూలవిరాట్టు వంటిదని, కావ్యాలు ఉత్సవమూర్తుల వంటివని" చెపుతారు. శైలి భాష జోడు గుర్రాల్లా సాగాలని, దానికి భావాన్ని కూడా జత చేస్తే త్రిపుటిలా తత్త్వ దర్శనోత్తేజమవుతుందని చెపుతారు.

తిరుపతి వేంకటకవులు తమ భాషా సంపదకు గల కారణాన్ని చెపుతూ ప్రతివ్యక్తి దగ్గరా ఒక్కొక్క మాట నేర్చుకున్నామని అదే తమ కవితా శక్తికి దోహదం చేసిందని చెప్పారు.

> ***తమకుఁ జుట్టుపట్ల దామరతంపరై***
> ***చెవులఁ బడెడినుడుల సేకరించి***
> ***మరలజనుల చెవికి మరలింపఁ గలిగిన***
> ***గవికిఁ గావ్యమునకు గలుగు వెలుగు*** (భాష) అని చెపుతారు.

కవిత్వంలోని పదం పరివృత్తి సహిష్ణుత కోర్వవు. వాచ్య లక్ష్యార్థాలను దాటి వ్యంగ్యార్థంతో పర్యవసించే శబ్దం సహజంగా వచ్చి కుదురుకోవాలి. "జలదముగ్రక్కున

జలముల వలె కవిత్వంలో ఒదిగిపోవాలి. ***'కావ్యమంటే శబ్దార్థౌ సహితౌ కావ్యమ్'*** - అంటూ మన ఆలంకారికులు ఇచ్చిన నిర్వచనాలను చెపుతుంటారు. ఏ కావ్యమైనా శబ్దార్థాలు లేకుండా ఉంటుందా? అక్కడి ప్రకరణార్థాన్ని పట్టుకోకుండా, పూర్వాపరాలు పట్టించుకోకుండా చేసిన నిర్వచనమది.

సూరంవారేమంటారంటే రసస్థితికి, భావాన్ని బట్టి, పదబంధాల కూర్పుండాలి అంటారు.

> ***దూదిపింజలు గాలిలోఁ దూలినట్లు***
> ***అత్తపత్తి కరస్పర్శ నణగినట్లు***
> ***నీటఁ గనకాంబరపు గింజ నిగుడునట్లు***
> ***భావమునుఁ బట్టి బంధాను బంధనములు***" (పదం)

'నీటిలో కనకాంబరపు గింజ'లా భావాన్ని బట్టి పదబంధాలు ఉండాలనటం గొప్ప ఊహ. ఇంకా పదాలు షట్పదీఝుంకారంలా, చెవిలో రహస్యం చెప్పేవాడిలా, భావాల పూపొదరింటిని తట్టిలేపి ఆలోచనాత్మకం కావాలంటారు. కృతజ్ఞతాంజలికి సదృశంగా 'అశ్రుతాంజలి' - అనే తప్పు పదాలు సృష్టించి కొందరు వాడుతున్నారు కాని తెలిసి అలా చేయటం తప్పే కదా! మరి ఎవరూ సృష్టించకపోతే పదాలెలా పుడతాయి మాస్టారూ? అంటే, ***అట్టి పెట్టుకొనెడి పదములైన బాసల పెంపుఁ బ్రబల జేయు*** - నని అంటారు. నూతన పదసృష్టి అర్థవంతంగా జరగాలన్నది సూరం వారి తీర్పు.

నుడుల వలన పలుకుబడికి, పలుకుబడుల వలన నానుళ్ళకు బలం చేకూరుతుందని, వీటి సాయంతో నూత్న సాహిత్యం సంసృష్టి జరగాలని చెపుతూ

> ***నుడుల కలిమి పలుకుబడులు హెచ్చించును***
> ***పలుకు బడులు నుడులు బలముఁ బెంచు***
> ***నుడులు పలుకు బడులు నూత్న సాహిత్య సం***
> ***సృష్టి హేతురూప మిష్టపడును*** (పదం)

అని చెపుతారు. పలుకు నుడికారం తెలియకుండా, నూత్నపదబంధాల్ని సృష్టించటం, వాటిని ఆమోదయోగ్యం చేయటం సాధ్యపడదు.

"Poetry is the rhythmical creation of beauty in world" - అన్న ఎడ్గార్ ఎలెన్ పో వాక్కులు కవికి కళ్లనిండా దయే గాదు గుండె నిండా ఉండవలసిన లయను గురించి కూడా వ్యాఖ్యానిస్తుంది. ఈ లయనే ఛందః శిల్పంలో భాగంగా మన ప్రాచీనులు భావించినట్లు తోస్తుంది. ఈ లయను గురించి సూరంవారు వ్యాఖ్యానించి చెప్పిన పాఠ్యం గమనిస్తే కావ్య శిక్షా బోధకుడు మనకు సాక్షాత్కరిస్తాడు.

క॥ పలికెడినుడి వైఖరిలో
నలయని స్వరముండుదానియందుఁ బరార్థ
ప్రలయము నదివిస్ఫోటన
ఫలమై ప్రభవించు వఱకుఁ బలుకు చెలఁగెడిన్ (లయ)

పలికే మాటతీరులో ఒకస్వరం (Tone) ఉంటుంది. ఆ స్వరమే విస్ఫోటన చెంది, దాని రిజల్ట్ వచ్చే దాకా అది పెత్తనం చేస్తూనే ఉంటుందని చెప్పటంలో ఏ వాక్యపదీయాన్నో చదివిన అనుభవం కలుగుతుంది. "ఒక నుడి, ఒక నుడికారం, ఒక వర్ణకం (ప్రత్యయం), ఒక వర్ణం, ఒక వర్ణ సంయోజనం, ఒక ఉనికి, ఒక పోలిక, ఒక కలయిక అర్థకోటిని ఉత్పాదింప చేస్తాయని చెపుతారు.

హృదయాల్ని తాకే కవిత్వపు లోగుట్టు గురించి చెపుతూ-

హృదయదఘ్నమై, భావన మెసఁగవలయు
ధిషణనికషగాఁ బదములఁ దీర్చవలయు
కర్ణపర్వమ్ముగా శైలి కలియవలయు (లయ)- అని భావం - శైలి - పదం గురించి చెబుతారు.

రీతి తత్సమ శబ్ద సంయోజనంతోనే సమకూరుతుంది. శ్రీశ్రీ మహాప్రస్థానంలోని రీతిని ఈ దృష్ట్యా చూసినప్పుడు శ్రీశ్రీ తత్సమపద భూయిష్ఠంగా ఎందుకు రాశాడో అర్థమవుతుంది. ఆ విషయాన్ని చెప్పి, లయ అనేది అలకల కదలికలోని సౌందర్యం, ఆ చెదిరిన అలకల్ని సవరించినప్పటి అందాన్ని రెంటినీ కలగలిపి చూసినప్పుడే లయ, శైలి - వీటిలో ఉన్న సౌందర్యాన్ని చూడగలం. పంటకాల్వలలో రాలిన పండుటాకులు సుకుమారంగా వలయాలనెన్నో సృష్టిస్తాయి. అటువంటి లయయే మన మనసులో పుట్టే భావ సంపదకు కావాలని చెపుతారు.

కావ్యంలో రసానుకూల వికారాలే భావాలు. ఎంతగొప్ప కావ్యమైనా అందులోని అక్షరాలు ఏబయి అయిదే. భరతుని మతాన ఎంత గొప్ప భావుకుడైనా పొందగలిగే భావాలు ఏబయి మాత్రమే. తుహిన కిరణ స్పర్శతో తామరకు చైతన్యం ఉదయించినట్లు దేనినైనా చూచినా, వినినా, ఊహించినా, ఆక్షణమే మనసులో కలిగే మార్పే భావము. మరి భావ పరిణామమేమిటి?

సొన జారుట నన విరియుట
కనువిప్పుట కలవరింత కలమ విరియుటన్
దొనమినుకుట కొనముగియుట
పనితనమా! కాదు భావ పరిణామంబే (భావం)

పొలమారుట తలమారుట
కల చెదురుట పలకరింపుఁ గథనెరయుటలున్
శిలయలుగుట యులి యులుకుట
తలమా తెలియంగ భావతల పరిణతులున్ (భావం)

సూరం వారిలోనున్న మరో గుణమేంటంటే, విషయాన్ని వ్యాఖ్యాతకు మిగిలించకుండా చెప్పటం. అన్నమయ్య కవిత్వంలో కూడా ఈ లక్షణమే కనిపిస్తుంది.

సాధారణీకరణం (Generalisation) రచయిత ఎలా చేయాలి? Generalise కాకపోతే కవి చెప్పిన కవిత్వం పాఠకునికి చేరుతుందా? వంటి విషయాలను గురించి సూరం వారు చేసినచర్చను గమనిస్తే

"on the contrary, the generalisation is not something super posed upon an accumulation of perceptions the perceptions do not in a really appreciative mind, accumulate as a mass, but form themselves as a structure; and criticism in the statement in language of this structure; it is a development in sensibility

(P-15. The sacred wood - T.S. Eliot)"

అని చెప్పిన వాక్యాలు స్ఫురణకు వస్తాయి. ఈ సామాన్యీకరణం నిరంతర ప్రక్రియ. అది జరుగవలసింది ప్రశాంతచిత్తంలో.

పాత్రలను గురించి సూరం వారేమంటారంటే, ప్రచోదనం లేని స్తబ్ద ప్రకృతుల మధ్య ఏ రసమూ పండదు. తల్లి ప్రేమకు ఉపమలేదు. మరి కద్రువ సంతానాన్ని నశించిపొమ్మని శపించింది కదా! పిల్లల అభ్యున్నతి చూచి పరవశించే తల్లిదండ్రులున్న లోకంలో, యయాతి, విశ్వామిత్రుడు కొడుకుల్ని శపించారు కదా! రాముడు తండ్రి మాటకై కానలకు పోయాడు. ప్రహ్లాదుడు తండ్రిని తిరస్కరించాడా? కోతి చేష్టల్ని తెలిసికోలేక రాముడే ఆశ్చర్యపడ్డాడు. అందువలన పరకాయ ప్రవేశం చేసి, పాత్ర తత్త్వాన్ని అవగాహన చేసికొని కావ్యాన్ని రాయాలి. ఎంత గొప్ప భావమైనా పంచుకునే వాడు లేకుంటే అది తన నీడే అవుతుంది. పాఠకుడే కవికి తోడు అని బల్ల గుద్ది మరీ చెపుతారు.

ఆధునిక కవిత్వంలో కథ వేరై పోయింది. కవిత్వం ఒంటరిదైపోయింది. అందుచేత కవిత్వంలో కవులకు భావంపైనే దృష్టి. అదే సౌందర్యాపాదకమైంది. భావమే చిత్రమై పఠితను పాలిస్తోంది. భావ్యమానమై ఎదలో కుదురుకున్న భావం పప్పన్నంలా రుచిస్తుందని సూరం వారు చెపుతారు.

తెలుగులో కవిజనాశ్రయ కర్త దగ్గరి నుండి కావ్యదోషాలను చర్చించారు. సూరంవారు పఠిత అనుభూతిని భంగపరచేవి ధోషాలని పేర్కొన్నారు. వాటికి కొత్త ఉదాహరణల్ని చెప్పటమే కాకుండా, కవులు చేసే కొత్త దోషాల్ని కూడా చెప్పారు. వీటిని తన పరిశీలనలో దొరికిన దోషాలని భావించాలి. సాగదీయబోయి తీగెల్ని తెంపినట్లు డొంక తిరుగుడు మాటలతో సాగదీయటం, భావశూన్యతతో రాయటం, గణవిభజన నేర్పుతున్నట్లు కుంటి నడకతో పద్యం రాయటం, భావనావస్థను కలచేలా రూపకం మీద రూపకాన్ని పెట్టి రూపు కట్టనీయకుండా కవిత రాయటం వంటి వాటిని ప్రస్తావించారు.

అనుభూతిని గురించి చెప్పిన వ్యాకరణం సూరంవారి అనుభూతులవిభూతే. "పుట్టుకతోనే ఏడ్వడం, ఆకలేసి ఏడ్వటం పసికూనకు ఎలా తోచింది? ఎవరు నేర్పారు? ఒక్క పసికూనయినా పుడుతూ నవ్విందా? లాలనలతో మాత్రమే ఎందుకు నవ్వుతోంది? భావాలు సహజాతాలు, వాసనాత్మకాలు, సహృదయ హృదయస్థాలు. అందుకే కళల్ని చూసి ఉప్పొంగిపోవటం. కళారసాస్వాదనలో రసించిపోవటం. అటువంటి అనుభూతి రసావిష్కారానికి ఎలా దోహదం చేస్తుంది. అది కింనిష్టం? వంటి విషయాలనన్నీ చర్చించి -

క॥ వాదమ్ములు ఖండనమ్ములు
భేదమ్ములు పూర్వపక్ష విద్ధాంతమ్మల్
వాదుగల పండితులకే
మోదుగులము మనకు మనకు మోహంబేలా? (అనుభూతి)

అని కవులను మోదుగులతో పోల్చి చెప్పటంలో సూరం వారి శూరత్వం కనిపిస్తుంది.

భారతీయ సంస్కృతిలో మోదుగు చెట్టుకు అత్యంత పవిత్ర స్థానముంది. మోదుగ చెట్టులోని పూలు, కేసరాలు, గింజలు, బెరడు, వేళ్లు, మొదలు, మాను, చెట్టుకొమ్మలు అన్నీ వైద్యంలో ఉపకరించే వస్తువులు.

యజ్ఞయాగాది క్రతువులకు పలాశపు సమిధల నుపయోగిస్తారు. పలాశ కుసుమాలతో శివుడిని, శివానీని అర్చిస్తారు. పలాశ కుసుమపు మకరందంతో శివునికి అభిషేకం చేస్తారు. పలాశ కుసుమాలతో సహజమైన రంగు నీళ్లను తయారుచేస్తారు. రణరంగంలో రక్తమోడేలా పోరాడిన యోధుల్ని కింశుక వృక్షాలతో పోల్చటం కవిసమయం.

'మోదుగులం మనకు మనకు మోహంబేలా' - అనటంలో కవికుండవలసిన నిర్మోహాన్ని నిర్భయత్వాన్ని చెప్పటంతో పాటు కవి లక్షణాన్ని చెప్పినట్లు, మోదుగకు ఉన్న గుణాల వలె కవికున్న లక్షణాన్ని

కవిసౌజన్యము, జ్ఞానదృష్టి సమసంస్కార ప్రియంభావనో
ద్భవకారుణ్యము, మానవీయ ఋణ విద్రాపేక్ష సంఘర్షణా
త్తవివేకమ్మును సర్వభూతహిత కృత్తార్థ సంసిద్ధి ని
త్య వినూత్న ప్రథమాన జీవన విదాభ్యాసమ్ము నీకబ్బుతన్ (అనుభూతి)

- అని వివేచించటంలో కనిపిస్తుంది.

"కో వేత్తి కవితాతత్త్వం శివో జనాతివా న వా" - అన్న ప్రచురోక్తిని తిరగరాస్తూ 'కవిత్వతత్త్వవేది సూరంవారు' అనేలా 'కవితాతత్త్వం' - అనే ఖండిక కనిపిస్తుంది. ఇందులో కవికి చేసిన హితబోధ కనిపిస్తుంది. పరస్పర సభాతీరాల నీదాడుతూ నీల్గటం, అందరికీ అర్థమయ్యేలా కవిత్వం రాయాలనటం వంటి అసంగతాలను గురించి

ప్రస్తావిస్తూనే కృతికి శాశ్వతత్వాన్ని కలిగించే విషయాన్ని ప్రస్తావించారు. మొగ్గ నుండి కుసుమం, పరాగం, తేనె, పిందె, కాయ, పండు, రసం ఎలా క్రమవికాసం చెందుతాయో గమనిస్తే కవికి అచ్చమైన రసస్పర్శ మచ్చికవుతుందని చెపుతారు.

నవ్యతను గురించి చెబుతూ చెప్పిన ఈ పద్యాన్ని గమనిస్తే రాయప్రోలు వారి 'వాణి వాయింప గలిగిన వీణమీద పారశీక గీతమ్ములు పలుకననెనె' అన్న పద్యం గుర్తుకొస్తుంది.

తరువు నిన్నటిదైనను దలిరు క్రొత్త
తావి నిన్నటిదైనను బూవు క్రొత్త
కవిత నిన్నటిదైనను గవిమి క్రొత్త
కాలమిసుమంత కరగిన జాలు క్రొత్త (కవితా తత్త్వం)

విభావాదుల భేదాన్ని బట్టి రసభేదాన్ని చెపుతున్నాంగాని, అన్ని రసాల వలన కలిగే ఆనందం ఒక్కటే. ఆనందంలో భేదాలుండవు. 'రసస్యానంద ధర్మత్వాదేకత్వం భావ ఏవ హి' - అన్న భావాన్ని ఎలా వ్యాఖ్యానించి చెప్పారో చూడండి.

కవితలో వెల్లియైనను గడలియైన
గాజు మబ్బైన నెలవంక గారమైన
నిరులు కురిసిన వెన్నెల సిరులునైన
నొక్కటే సాంద్ర సమ్మోదమక్క జముగ (కవితా తత్త్వం)

కవిత్వంలో వరయినా, కడిలియైనా, కాణటుమబ్బైనా, నెవంక కాంతినైనా, చీకట్లయినా, వెన్నెలయినా - వేటిని వర్ణించినా కలిగే ఆనందమొక్కటేనని చెప్పారు. ఇలా చెప్పటానికి కేవల పాండిత్యము, గ్రంథ పఠనము సరిపోదు. అది జీవితాన్ని సాహిత్యతత్త్వాన్ని అనుభవించిన ఋషి సదృశ సహృదయులకు మాత్రమే సాధ్యం.

'కవి – పాఠకుడు' - అనే శీర్షికలో కవికి పాఠకుని అవసరమెంత? అనే విషయాన్ని చర్చించారు. ఏ పొలంలోనో, ఎవరూలేని ఏకాంతంలోనో పొటమరించే అచ్చమైన పాటకు శ్రోతలెవరు? అంటూ ప్రశ్నించి, కవి తలపులు పాఠకుని అభిరుచి భేదాలను బట్టి కావ్య సౌందర్యంలో కూడా విభిన్నత ద్యోకతమవుతుందని, కావ్య సౌందర్యం కేవలం కవిత్వంలోనే కాకుండా పాఠకుని భావనలోనూ ఉంటుందని వివేచించారు.

ప్రపంచమే కవికి బంగారు గని. ఈ విశ్వసాహితిలో కథకుని కోసం నిరీక్షించే కథలు ఎన్నో! మరి ఆ కథల్ని నిద్రలేపేవి ఏమిటంటే?

ఆ.వె. ***పడినచినుకుగాని, పడిలేచుసడిగాని***
తడియు నేలగాని, తావిగాని
మొలుచుమొక్క గాని, తలపుతాకిడిగాని
కథల నిద్రలేపఁ గలుగుఁ ద్రుటిని (నవకథాధృతి)

అని కవితాత్మకంగా కథల్ని నిద్రలేపే సందర్భాన్ని చెబుతారు. ఏళ్లు, ఏటి పాయల ఒడ్డు పాతవే కాని పారే నీరు కొత్తది కదా! అలాగే పాత కథకు కవిత్వ భావనతో నవలతను సిద్ధింపజేయాలని చెపుతారు. మనందరికీ పరిచయమైన ఏడు చేపల కథలోని ముగింపులో పసివాడు పుట్టలో వేలు పెట్టిన సందర్భాన్ని సూరంవారు వ్యాఖ్యానించిన తీరు గమనించండి. 'పుట్టలా విధంగా అందంతో ఉంటే, అసూయతో పట్టలేకనే వేలు పెట్టానని' అంటే అది ఈనాటి సమాజంలోని ఈర్ష్యాసూయలకు ప్రతీక అవుతుంది కదా! అనూహ్యంగా భారత కథను శల్యుడు, తన మనుమరాలి సంభాషణతో ప్రారంభించి 'పర్వ' - లో భైరప్ప చెప్పారు. మురిపెంతో మురిసి మూడు తరాల పెళ్లిళ్లు చేశాడు భీష్ముడు. అన్నీ ఫెయిల్యూర్సే. అక్కడి సమస్యలేమిటో కారణాలవైనమేమిటో? చెపితే అది నవ్యత అని అంటారు సూరంవారు

గతానికి ప్రకృతానికి గల అనుస్యూతిని వివరించారు.

నాటి జీవితమే మన నాటి చరిత
నాటియిరుల మిణుగురులే నేటి వెలుగు
చీకటి తరించు మిణుగురు చితికిపోవు
వెలుగుమాత్రమనుస్యూతి విశ్వవిహృతి (నవకథాధృతి)

- అని గతం నుండి వర్తమానంలోకి ప్రవహించే అను సూక్తిని వివరించారు.

కథ, నవలా ప్రక్రియలను గురించి చేసిన చర్చలో కథలో ఉండవలసింది అర్థవాదం కాదు అనుభవమని చెపుతారు. దేశకాల పాత్రలతో పాటు, పరిణామాన్ని గమనించే దృష్టి మనోరీతి, చలనశీలత్వం, ఆశ- ఇవన్నీ వస్తుతత్త్వాన్ని నిర్దేశిస్తాయని చెపుతారు. మొన్నటి తరంలో కుక్కి మంచాలపైన సంజవేళ చతురులు చెప్పగా

మగతనిద్రలో వింటూ మురిసిపోయిన కథలన్నీ ఏమైపోయాయని కవి ప్రశ్నిస్తాడు? వర్తమాన చైతన్యంలేని నవలయినా, కథయినా వ్యర్థమేనన్నది సూరంవారి తీర్పు.

'కవితృష్ణ' - శీర్షికలో కవులకున్న దౌర్బల్యాలనన్నింటినీ వాచ్యంగా, వ్యంగ్యంగా ఎత్తిపొడవటం కనిపిస్తుంది.

తెలియవుగాని నీవు సుకృతీ! కృతి యొక్కడె సర్వజీవ భా
వ లలిత మీసమస్తమును వర్తిలఁ జేయురస ప్రకారమౌ (కవితృష్ణ)

అని బోధ చేస్తారు. బోధించటమే లక్ష్యంగా పెట్టుకున్న వారినుద్దేశించి ***'వినుధాతువుపై జనియించద కర్త్రర్థము'*** - అని అంటారు.

'కవినిష్ఠ' - అనే శీర్షికలో రాసిన పద్యాలన్నీ కవిత్వం రాసే ప్రతి ఒక్కరు చదివి ఆచరణలోకి తెచ్చుకోవలసిన విషయాలు.

సుభాషితాల్లా ఉదాహరించదగిన ఎన్నో పంక్తులు ఈ శాస్త్రకావ్యంలో మనకు సాక్షాత్కరిస్తాయి. "సత్యప్రేమ సౌందర్యముల్ స్తవనీయంబులుగానిచో సుకవితా సామ్రాజ్యముల్ వ్యర్థముల్" -

"కవులేగద రసము హితము కవితోద్గతిలోన్"
"కవికి సద్భావనానిష్ఠయవసరమ్ము",

"కవియె చైతన్యమూర్తియై కదలవలయు" - వంటి పంక్తులు ఆదర్శంగా కవిలోకం నిలుపుకోవలసిన పంక్తులు. ***"కైతల్ మొగమోడు మాటల? యలంతుల్ మెచ్చు పూదోటలా?"*** - అని కవి లోకానికి ప్రశ్న వేసి సరి చూచుకోమంటారు. ***"వ్యాసుడొక్కడు తప్ప సర్వమును గూర్చి మౌనముగ నిష్క్రమించిన మహితుడేడి"?*** - అని కవులకవసరమైన నిశ్శబ్దాన్ని గురించి చెపుతారు. "సత్యసంఘర్షణమె కథ, స్వభావ నిర్వహణయె కథనమ"ని ఒక అరిస్టాటిల్, ప్లేటో లాగ సూత్రీకరించి చెపుతారు. రాశి కంటే వాసి ముఖ్యమని చెబుతూ హాలుడు, అమరుక కవి, భారవి, మయూరుడు, శ్రీహర్షుడు, మాఘుడు, శూద్రకుడు కనీసం ఒక పది కావ్యాలయినా వ్రాశారా? అని ప్రశ్నించి -

గుండె ప్రిదలవెదలి, గుండెగుండెనుదాకి
యండగాగ నిలచి కొండవోలె

ఒక్క మదికినైన నోదార్పు నిడజాలు

నొక్క కృతియచాలదోమనస్వి (కవినిష్ఠ) - అని జీవిత సాఫల్యతా సాధకంగా ఒక్క కావ్యం చాలు అని చెపుతారు.

ఎన్ని చెప్పినా కవులకు ద్వితీయ పురుషార్థం పట్ల లౌల్యం ఎక్కువ. ఆ లౌల్యాన్ని గురించి ప్రస్తుత కవిలోకంలో ఉన్న బలహీనతను ప్రస్తావిస్తూ, "కవిలోకంలో చేయిచాచటం కొంత తగ్గిందిగాని, ఇతరులు కనిపిస్తే కాళ్లు చాచటం బాగా అలవాటయిందని ఎద్దేవా చేస్తారు. కవి తలవంచవలసింది కాలానికి, దైవానికి, కర్మకు, ధర్మానికి, సత్యానికి, తత్త్వానికి, శ్రమకు, స్వేదానికి ఇంకా చెపితే సమాజానికి. అంతేగాని దండలకు కాదు"- అని కవిని జాగరూకుడిని చేసే ప్రయత్నం చేస్తారు. నీమాటలకు నీవే కట్టుబడకపోతే సమాజం క్షమించదని చెపుతాడు.

తన మహోన్నత భావన తన చికీర్ష
తన సమాజ హితోక్తియ తన వివక్ష
తన వినిర్మాణ దీక్షయే తన రిరక్ష
తన జగన్నేతృ సృష్టియే తనజిగీష (కవినిష్ఠ)

ఈ పద్యంలోని పంక్తులు కవి రచయితలు ఎప్పుడూ మననం చేసుకోవలసిన ఒజ్జ పంక్తులు.

కేవలం నాపై ఉన్న వాత్సల్యంతో నా అభిప్రాయాన్ని సూర్యవర్చులైన సూరంవారు అడిగారు. ఆ పుస్తకాన్ని చదివి నేను రాసుకున్న నోట్సు ఇది. వాస్తవానికి ప్రతి పద్యము ప్రాచీన ఆలంకారికుల, ఆధునిక విమర్శకుల తాత్త్వికతను ఎలా పొదివి పట్టుకున్నాయో వ్యాఖ్యానించి చెప్పాలనిపిస్తుంది. భవిష్యత్తులో ఆ పని చేయాలని మనసు ఉవ్విళ్లూరుతుంది. ఈ వివృతి ***'గంగా జలాన్ని గంగకే హారతి ఇవ్వటంలాంటిది'***. నాగరికతలో, సంస్కృతిలో భాగమైన ఒక జ్ఞానాంశాన్ని ఈ రూపంలో అందిస్తున్న సూరంవారి శూరత్వానికి ప్రణమిల్లుతూ..

- బూదాటి వేంకటేశ్వర్లు

❖

కవితారసప్రేరణ

– చిటితోటి విజయకుమార్
హైదరాబాద్

కవి హృదయమెంత అంతు చిక్కనిదో కవిత్వమంత చిక్కనిది. అందుకే అవి రెండూ అభేదాలూ, అభేద్యాలూ.

ప్రపంచవ్యాప్తంగా తొలినాళ్ళ నుండీ సృజింపబడిన సారస్వతాన్ని తరిచిచూస్తే తమ అమేయమైన సృజనాతపశ్శక్తితో దివ్యాకాశకవితాసురఝరిని ధరకు దింపిన అపరకవితాభగీరథులంతా భారతావని ముంగిటి బిడ్డలే అనుటలో లేశమైనా అతిశయోక్తి లేదు. తన్మూలంగానే కవిత్వమెలా ఉండాలి? ఎలా ఉండకూడదు? ఏది గుణము? ఏది వ్రణము? ఏది దొసగు? ఏది ముసుగు (ధ్వని)? ఏది సరస ప్రయోగం? ఏది విరస ప్రయోగం? ఏది సుకవి విధానం? ఏది సుకవితా ప్రస్థానం? అను సిద్ధాంతాల రచనపై అప్రకటితంగానే భారతీయ లాక్షణికులు స్వత్వాలను సంపాదించినారని చెప్పుకోవచ్చు. దీనికి ఋజువుగా ఎన్నో భారతీయ లక్షణ గ్రంథాలు పాశ్చాత్య భాషానూదితములై అక్కడి భాషావేత్తలకు ఆమోదితాలూ, అనుసరణీయాలై నిలచినవి.

కవి పూర్వం రాజాస్థాన పరిమితి గలవాడు కాగా ప్రస్తుత కవి పరిధి ప్రజాస్థానానికి విస్తృతపరుపబడినది. నాటికీ నేటికీ సామాజిక సాంస్కృతిక రాజకీయ కవితా విధానాలలో పెనుమార్పులు చోటుచేసికొన్నాయి. కనుక క్రొత్త పోకడల కనుగుణమైన కవితా శిల్పమును ప్రతిపాదించుకోవడం అవశ్యమైనది. ఆధునిక కాలంలో ఒండో, రెండో సలక్షణ గ్రంథము లగపడుచున్నా అవి పూర్వ కవితా లక్షణ విధేయాలూ, వాటి అభివర్ధనాలే అనదగును గానీ అనుభవ సారములనో, క్రొత్తగా ప్రతిపాదింపబడినవనో, సంపూర్ణాలనో చెప్పుట కష్టము.

ఈ నేపథ్యములో ఇప్పటి అత్యాధునికులలో (Living Legends) ఒకరైన డాక్టర్ శ్రీ సూరం శ్రీనివాసులు గారు సరళ సుందరమైన పద్యాలలో అటు పండిత కవులకూ, ఇటు ఛాత్రకవులకూ సుబోధకమైన శైలిలో, కవితానుభవసారముగా ఈ “రసవిద్య”ను

విరచించి కవితాలోకానికి ప్రసాదించినారు. సుకవితకూ సుకవికీ ఉండవలసిన లక్షణాలనూ, ఉండకూడని లక్షణాలనూ సూక్ష్మంగా కూలంకషంగా బోధించినారు.

ఈ పని సామాన్యమైనది కాదు. భాషపై, భావంపై, వ్యాకరణంపై, శబ్దంపై సాధికారత ఉండాలి. మాన్యులు డాక్టర్ సూరం శ్రీనివాసులు గారు తాము స్వయంగా అత్యంత ప్రతిభాశీలురైన శతావధాని, పండిత ప్రకాండులు, సత్కవులు, విమర్శకులు కనుక ఈ రసవిద్యా ప్రతిపాదన వారికి సులభతరమైనది.

గత ఐదారు నెలలుగా కవీ! శీర్షికన వాట్సప్ వాక్స్థలి వనాలలో తెరలుతెరలుగా రావిపత్రాలై రాలిపడిన ఈ రసవిద్యాపాఠాలు కవిలోకానికి జ్ఞాన ప్రసాదకాలైనాయి. వ్రాసీ వ్రాసీ ఖాళీ అయిన కలాలలో క్రొత్త సిరా నింపాయి. ఏమి వ్రాస్తున్నారో తెలియని కవుల పంక్తులకు లాంథర్లు పట్టాయి. ఎందుకు వాస్తున్నారో తెలియని మెదళ్ల చెదళ్ళు దులిపాయి. అప్పుడే నిలబడ్డ కలాలకు నేత్రాలైనాయి. కవితాపరిపాకం సాధించిన కలాలను అప్రమత్తం చేశాయి. వెరసి డాక్టర్ సూరం శ్రీనివాసులు గారి "రసవిద్య" యావదాధునిక కవిలోకానికి గొప్ప స్ఫూర్తియై కవితాప్రేరణయై నిలిచింది.

రసవిద్యకు కొసమెరుపుగా "వినయం" పాఠాన్ని కవిగారు ఉపసంహారంలో ఆచరణాత్మకంగా బోధించారు అని తోచుచున్నది. మేరలేని వారి బోధనాపటిమను వివరించేందుకు ఇంతకు మించిన నిదర్శనం ఇంకేమి కావాలి? ఉపసంహారంలో శ్రీ సూరం గారు "ఒకట పరులడుగకున్న జెప్పిన పరిణతి ఫలమేమౌనో!" అనే ఒక సంశయాత్మక భావాన్ని చమత్కారంగా వెలిబుచ్చినా, "పరోపకారాయ వహన్తి నద్యః....." అన్నట్లు త్యాగధనులైన వారు లోకహితార్థం తాము ఇవ్వదలంచుకొన్నది ఎవరూ అడుగలేదని ఇవ్వక మానరు కదా.

అత్యాధునిక లక్షణ గ్రంథాలలో చిరస్థాయిగా నిలిచియుండగల ఇంతటి చరిత్రాత్మక గ్రంథానికి నాలుగు మాటలు వ్రాసే సదవకాశం కల్పించిన మా పూజ్య గురువుల వాత్సల్యానికి నమస్సులర్పిస్తూ...

- చిటితోటి విజయకుమార్

హైదరాబాద్
04.07.2022

❖

నా మాట

ప్రాణి పుట్టినప్పుడే ఆలోచన మొదలైంది. ఆలోచనలు బయల్పరచటం ఆరంభం కాగానే అందరికీ చెప్పాలనీ, అందరిలా కాకుండా తానేదో కొత్తగా చెప్పాలనీ తహతహ మొదలైంది కొందరిలో. ఆ కొందరి సంకల్పాలే కవితా రూపాలు. కవిత్వం తనకు తగిన రూపాన్ని తానే నిర్ణయించుకోగలదు. అయినా అన్నింట్లో జోక్యం చేసుకునే మానవస్వభావం దాన్నీ నియత్రించే ప్రయత్నం చేసింది. దాని శరీరాన్ని విభజించి చూసింది. దాని ఆత్మను అనేక కోణాల్లో నుండీ అన్వేషించింది. అయినా ఆ ప్రయత్నాలు నిత్యనూతనాలే. కవులూ, పాఠకులూ విడివిడి మనుషులు కావటం, విడివిడిగా ఎవరి వ్యక్తిత్వం వారిది కావటం దానికి కారణం. ఈ దృష్టితో ప్రాచీనులు విభిన్నవ్యక్తులు విభిన్న దృక్పథాలను ప్రకటించి, వాటిని దాదాపు అందరూ రసోన్ముఖం చేయటంతో అది అలంకారశాస్త్రంగా / సాహిత్యశాస్త్రంగా రూపొందింది. ఆధునికంగా లక్షణ గ్రంథాలుగా స్థూలంగా కానీ, సూక్ష్మంగా కానీ ప్రకటితమైనవి చాలా తక్కువ. కవుల సంఖ్య పెరిగింది. ప్రచార ప్రసార మాధ్యమాలూ పెరిగాయి. ఈ దశలో వాటిని పరిశీలనాత్మకంగా చదువుతుంటే కొన్ని విషయాలు చెప్తే బాగుంటుందని అనిపించింది. ఆ ఆలోచనలకు రూపకల్పనమే ఈ ప్రయత్నం.

స్థూలంగా ఎలా ఉంటే అందగిస్తుందో, ఎలా లేకపోతే అందం మందగిస్తుందో ఆలోచించి ఆస్వాదించటమూ, ఆ విషయాలనే ఇతరులకూ అందించగలగటమూ అనే విషయంలో ఒక స్వల్ప మార్గదర్శిక ఇది - రసవిద్యాపరపర్యాయమైన కవనశిల్పసమీక్ష. ఏ ఒక్కరికైనా ఇది ఉపయోగపడి మార్గదర్శనం చేయగలిగితే కృషి సఫల మైనట్లే.

దీనికి ముందుమాటలుగా తమ అభిప్రాయాలను అందించిన మాన్యులు, ద్రావిడ విశ్వవిద్యాలయం పూర్వ ఉపకులపతి శ్రీ గంగిశెట్టి లక్ష్మీనారాయణ గారికీ, బనారస్ హిందూ విశ్వవిద్యాలయం ఆచార్యులు శ్రీ బూదాటి వేంకటేశ్వర్లు గారికీ, అభిప్రాయంతో పాటు ఆర్థికంగానూ సహకరించిన శ్రీ చిటితోటి విజయకుమార్ గారికీ కృతజ్ఞతాపూర్వక నమస్సులు. పుస్తకీకరించిన అంతేవాసి విట్టుబాబుకు అభినందనలు.

- డా. సూరం శ్రీనివాసులు

❖

రసవిద్య

కవనశిల్పసమీక్ష

రసానుభూతి

పుట్టుకలతోడ నాకలి పుట్టినప్పు
డేడ్వఁ బసికూన కెటు తోచె? నెవడు నేర్పె?
నొక్కడైనను నవ్వ డీ లెక్క యేమి?
కనుచు లాలనలన్ నవ్వఁ గలుగుటేమి?

భావములు సహజాతముల్ వాసనాత్మ
కములు సహృదయస్వాంతసంస్థములు సతము
కళలఁ గాంచుట నుప్పొంగి కలక దీరి
రస్యమానములై యవి రసము లగును

భావవ్యక్తీకృతి కను
భావంబులు సాధనములు పదునగు ననుభా
వావిష్కృతి సత్కవితా
హేవాకము బాఠకాళి యెదఁ బ్రవహించున్

కొన్ని నియతములును గొన్ని జాత్యంబులు
కాలదేశజాతకళలు కొన్ని
వ్యక్తిగతము లగుచు వర్తిలు మరికొన్ని
చేష్ట లంతరంగసిద్ధిఁ దెలుప

ఆంగికాభినయాత్మత నందఱకును
మోదముం గూర్ప రూపకమ్ములె తగినవి
మిగుల ననుభావ వర్ణన తగిలినపుడు
శ్రవ్యమును నాటకీయత రమ్యమగును

కావ్యమును విన్నఁ జదివినఁ గన్నఁ గలుగు
మానసస్పందనయ సమామ్నాతమయ్యె
రసము నాహ్లాద మనుభూతి రసికహృదయ
పాత్రతాదాత్మ్య మను వర్ణబంధనముల

ఆంతరములోన నవిబాహ్య మైన చర్య
చలనచాలనజ్వాలనజ్వలనరీతి
నగు ననన్యప్రమాణమై యనుభవమున
నది యనన్యచ్ఛేద్యమౌ నా క్రమమున

వ్యక్తిగతజాతిగతనీతి యాపఁ గలుగు
ననుభవమ్మును నొకమేర నంతె గాని
ప్రబలతరమైనచోఁ గావ్యవర్ణనమ్ము
కలుగబో దగమ్యత్వసంస్కారమతియు

కలుగు తాదాత్మ్యమును బట్టి కంటనీరు
జాలువారుఁ; జిత్తము సైపఁజాల దింత
యేని యుద్రేక; మది హేతు వీ వికృతికిఁ
దానికిం గతమౌట కైతకును ఘనత

చదువునప్పుడు గేయవచనకవితలు
ముక్తకమ్ము లెదో హాయి ముసురు మనసుఁ
బదమొ భావమో గానమో పలుకుతీరొ
గుండెలను దాకు నదె రసాకూతసిద్ధి

భావమునకన్నఁ దత్ప్రతిపాదనమ్మె
కవితలో ముఖ్య మదె ముఖ్యకారణముగఁ
గరుణమైనఁ బరాహ్లాదకరణమగుచుఁ
బాత్రకవిపాఠకులఁ గవిత్వమ్ము మించు

చిత్తసంవేద మానందజీవభూత
మది కళాచర్వణోత్పన్నమై రహింప
నూహ కందని హేతువేదో ధ్వనింప
దాని తప్పమి భిన్నవాదనల కుదురు

రసము పాత్రలయందు రాణిల్లు ననె నొక్క
డది కాదు నటులయందనియె నొక్క
డక్కడెక్కడొ యున్న ననుభూతి మనకేల
మనలోననే యుండు ననియె నొకడు

మనకేమి కాని దానిని జూచి మనకేల
సంబడ మనె నొక్క సాధుజనుడు
పరుల వస్తువు చూచి పరవశించుట కాదె
యదియ యందరి వస్తు వనియె నొకడు

యయిన నది దోషమే గదా యనెనొకండు
నదియు భావనాత్మకదోష మనెనొకండు
తప్ప దనివార్య మనగ సిద్ధాంతమయ్యెఁ
గళల ననుభూతి రసపదగ్రాహ్యమయ్యె

పాత్రలు గతించుఁ గవి యుండవచ్చు లేదు
వర్తమానత పఠితృతద్భావనములఁ
గాన ననుభూతి పాఠకగతమె దాన
వివిధరీతులు రసపదావిష్కరణలు

వాదమ్ములు ఖండనములు
భేదమ్ములు పూర్వపక్షవిద్ధాంతమ్ముల్
వాదుగల పండితులకే
మోదుగులము మనము మనకు మోహంబేలా?

కవిసౌజన్యము జ్ఞానదృష్టి సమసంస్కారప్రియంభావనో
ద్భవకారుణ్యము మానవీయఋుణవిద్యాపేక్ష సంఘర్షణా
త్తవివేకమ్మును సర్వభూతహితకృత్తత్వార్థసంసిద్ధి ని
త్యవినూత్నప్రథమానజీవనవిధాభ్యాసమ్ము నీ కబ్బుతన్

కవితానిర్మితి నవరస
సవనము స్వరభేదమున్న సత్ఫలజాతం
బవికారి యనగఁ బొసగదు
కవిలోకమ్మది గ్రహించఁగా వలె నెపుడున్

చిత్తస్పందన ననుభవ
మత్తత రసరూప మగుచు మమ తవ భావో
న్మత్తత కతి దూరముగా
జిత్తద్రుతిదీప్తివితతిఁ జెలగు ముదంబై

కావ్యనాటకములఁ గవితలఁ గళలలో
ఫలిత మనుభవమ్ము వలన ముదము
రసము నాగఁ జెలగు రస్యమానతఁ జేసి
యాదికావ్యమాది నదె విలిప్స

రసపదవాచ్యుడై చను పరాత్పరు డైన స్వకీయసత్క్రియా
విసరముఁ జేసె భూతలము విప్పిన సుందరసత్యరూపమై
విస్మృమరమై యనంతజనవిస్తృతవేదికయై చెలంగ నా
పసదనమే తలంపులను బైకొని నిల్చు రసప్రకాశమై

ఒక రమణీయదృశ్యమును నొక్క మనోరమశబ్దసౌష్ఠవం
బకలుషచిత్తముం దగిలి యార్ద్రతఁ గూర్చి చలద్విశేషభా
వుకతను బ్రోదిచేయుచుఁ జవుల్ జనియింపగఁ జర్వ్యమాణమై
ప్రకటితమౌ రసంబనగ పాయక నాంతరకోశరూపమై

సృష్టి సంభవమే పరమేశకాంక్ష
భవ్యసౌందర్యదర్శనప్రాప్తికొఱకు
దాన స్పందించు నెడద సంతసముకొఱకు
దాని కొక గొప్పపేరు; తత్పదమె రసము

రసరూపము సర్గాత్మ
ప్రసరము విశ్వాంతరాళపరిక్కృతవైవి
ధ్యసమాకలితము కవితా
లసదద్భుతనిర్మిమీషలన్ వెలువడెడిన్

❖

కళాశిల్పము

పూలు గ్రుచ్చి యలసిపోయిన చేతులు
కట్టె కొట్టి కందు కరయుగళము
పద్యములను వ్రాసి పండిపోయిన చేయి
సమము లని యెఱింగి సాగవలయు

ఇసుక జల్లెడపట్టఁ గ్రొంబసిడికొఱకు
రాళ్ళ బ్రద్దలఁ గొట్టు శిల్పములకొఱకు
వ్రేల నొక్కును మట్టి కుండీలకొఱకు
గవులు గారె వారలు శిల్పకర్మరులును?

ఒక జోలపాటపాడుచు
నొకలోకము సృష్టిచేసి యొక నిముసములో
నొకశిశువుఁ బండఁ జేసెడి
యకలుషవాత్సల్యమూర్తి యమ్మయుఁ గవియే

చినుకులు రాలుటలో, వే
చిన చీకటి మెల్ల మెల్ల చిద్రుప లగుటలో
ఘనఖండపుఁ బయనములోఁ
గనరావే నలువ వ్రాయు కవితల మెఱుగుల్?

వరి నాటంగడగుటలోఁ
దరుణములోఁ గోసి పనలఁ దరలించుటలో
సరి కుప్పలఁ దీర్చుటలోఁ
బరికింపవె కూర్పునేర్పుఁ బరిణతకవితన్?

❖

కవితాశిల్పము

సాలీటి కుటినున్న సాధునిర్మాతృత
చీమల పురిలోని సిద్ధకరత
కాకనీడమ్ములోఁ గనపట్టు పూర్ణత
తేనెపట్టులలోని తీపికొలత
తీరకుళీరసంచారపు వికటత
యలల కదలికల నలరు క్రమత
నిండుకుండను దోచు నిర్భరరసవత్త
ఖేచరగమనసంకీర్ణసమత

కలిసి యల్లికలై దివ్యకాంతి మెఱసి
యలరఁ జేయుచు నెడదల యందు నిలిచి
తోటివారికి నడియేటి బాట యగుచు
సాగఁగా వలె స్వీయసంస్కార కవిత

మొదలిడిన భావభంగిమఁ
దుద దాకను సాగనీవు తొందరతో నీ
యెదపగిది నర్ధనగ్నత
బదనాయము చేయువాడవై కెలుకుదువే!

పొరుగింటి పుల్లకూరయ
దరువులు వేయించు వచ్చు; దానికి జతగా
సరిపోవలె మన యన్నము
సరిగామిన్ విడువవలెఁ బ్రసన్నతకొఱకై

సత్యవిచికిత్స సత్యసంసక్తచర్చ
సత్యపథపురోగతియును సాగవలయు
వ్యంగ్యమర్యాదతోఁ గథలందు నదియ
జాతినిర్మాణశైలి కాస్పదము పథము

పద్యరచన కాదు పద్యకవిత్వమ్ము
వచనకవిత కాదు వచనరచన
చదువుచున్న యపుడె చవులూరు కవితగాఁ
“దోచవలెను” మనసు దోచవలెను

రుచులు కుదరనపుడు రోసి సమీక్షించి
కారణమ్ము చెప్పఁ గలము కాని
కుదిరినపుడు హేతు విది యని యది యని
తెలుపలేము కవిత తెఱగు నదియ

ప్రాణ మొక్క చోట వ్యానమ్ము సర్వత్ర
నిలిచి దేహయష్టి నిలుపునట్టు
లంద మొక్క చోట నాభిరూప్యము నెల్ల
నిలిచి కథను గవిత నిలపవలయు

ఇతివృత్తం

కథను బ్రఖ్యాతముం గొన్న కవికి సులువు
కాని మెప్పింపఁ గలుగుట కష్టతరము
తానె కల్పించుకొన్నచోఁ గథను స్వేచ్ఛ
గా మలుపుఁ ద్రిప్పవచ్చు సకారణముగ

ఒక్కచోఁ బాత్ర ప్రఖ్యాత మొప్పుచుండుఁ
గథయుఁ గథనమున్ గవిమతికల్పితములు
నవియు రాణించు మెప్పుల నందుఁ గాని
పాత్రసహజప్రవృత్తిఁ గాపాడవలయు

ధారుణిఁ గనరాని యసా
ధారణకృత్యములు దోచు దండిగఁ గృతులన్
కారణమటఁ బ్రఖ్యాతియ
నేరము మన కల్పనముల నిలుపగ నటులన్

కథలఁ గావ్యాలఁ జేసెడి కళలయందు
వర్ణనలు మాటలును పాత్రభాషణముల
జాతివార్తాచమత్కృతుల్ చాల వలయు
సామెతలు నామెతలుగాఁ బ్రశస్తిఁ దెచ్చు

ద్వీపవనగిరివాసులు వేపమాన
దీపకళికలు సతత మనూపచరులు
లేనివారలు కన వినలేనివారు
కొల్లలుందురు వారివి గూడ కథలె

జానపదుల కథలు జనహితలక్ష్యముల్
పిల్ల పిడుగు గంతువేయు గడులు
వాని మార్చవచ్చుఁ గాని లక్ష్యము మార్చి
కథను దీర్చుటన్న కల్ల యగును

చరితఁ గూర్చి వ్రాయ సాక్ష్యముల్ చాలవు
కల్పనములు దగవు కలలు దగవు
ఊహ మేరఁ గడగ సాహసమే యది
కత్తిమీద సాము నెత్తి బరువు

పౌరుషమ్ము గుట్ట బదునుదేరుచు నుండి
మనచరిత్ర లెంతొ మాయచేయు
ననుసరింపఁ జాల మవల నెట్టగ లేము
వింత మానవుల మొకింత మనము

రాజ్యముల నాక్రమించిన రాజు చరిత
హద్దురాళ్ళను జరిపిన యతడు దొంగ
యేది యాదర్శమో యేమొ యింత తలచి
వ్రాయగాఁ దగుఁ జరితకావ్యమ్ము లెపుడు

సాంఘికమ్ముల వ్రాయుచుఁ జకచకచకఁ
గారులన్ బారులన్ నేలబారుజనుల
కథలనే గాక నైసర్గికముగ బ్రతుకు
వారి గూర్చియు వ్రాయగావలెను గవులు

వ్యక్తి కన్న వ్యవస్థయే వాస్తవముగ
వేనవేల లక్షల రెట్లు పెద్దదియగు
దాని గుర్తించి కథ వ్యవస్థాపరముగఁ
దీర్చినం గిట్టుబాటును ద్విగుణమగును

❖

ఎత్తుగడ

ఎత్తుగడ మదిని మెదలిన
తత్తరతో మొదలు పెట్టఁ దలచుట తగవే?
చిత్తయిపోదువు నీవే
మొత్తము నటు వ్రాయలేక బులుపు విఱుగుటన్

ఎత్తుగడను బట్టి యెగసి యెగసి సాగు
భావ మొక్క యెడలఁ బరుగు లిడుచు
నెత్తుగడయ యాపు నికసాగనీయక
పద్యమొక్కయెడలఁ బాసి తలపు

ఎత్తుగడ మాత్రమే నచ్చి యెన్ని పద్య
వచనపంక్తుల మెచ్చెనో పాఠకాళి
ప్రాణ మది సిద్ధభావనిర్మాణమునకు
నది ముగింపుతో జతగూడ నది యుడుగర

పదమొ పదబంధమో నచ్చి వాచిపోయి
దానితోఁ బద్యశేషమ్ము తగులఁ బెట్టఁ
బూనికలు మంచివే పట్టిపోయి తుదకుఁ
దాలుతరగలఁ బూరించి తనియకున్న

పదబంధమొ నిర్దేశన
పదమాత్రమొ యవ్యయమ్మొ బంధురకాక్వా
స్పదమో యామ్రేడితమో
గదనీయమ్మైన యెత్తుగడయౌ కవితన్

అన్యములుందోచును సా
మాన్యప్రకటప్రకారమానితగతులున్
మాన్యంబులు సత్కవితా
ధ్వన్యంబులు సంతులితవిభాసితపదముల్

గానమునకు ముక్తాయింపు కళను బెంచు
పద్యమునకు ముగింపు శోభలనొసంగు
నెత్తుగడయు ముగింపును హేలగా స
మాహితమ్ములైన కవిత యద్భుత మగు

భంగపాటు సహజమౌట భంగములకు
నందముం గూర్చు నలలకు నదియుఁ గూడ
కవితలో నెత్తుగడలోనఁ గలిగెనేని
భంగపాటు పూర్తిగ భంగపాటె కవికి

పద్యకవితకన్న వచనకవిత్వమ్మె
యెత్తగడను నాశ్రయించి వెలయు
నొక్క పలుకుముక్క చిక్కిన ననువుగా
చాలు వచనకవిత సాగు రుచిగ

విదితసుప్రసిద్ధపదబంధమైనను
భావబంధమైన పట్టి, మొదలు
పెట్టి తుదివరకును పట్టుగా నడిపిన
నదియు వచనకవిత నందగించు

ఎత్తుగడలోన విచికిత్స నింత నింపి
యుత్సుకతఁ గూర్చి యాపైన నున్న దున్న
యట్లు కవిత పరిష్కార మన్నయట్లు
వ్రాయుటయు రమణీయమే వచనకవిత

ఎత్తుగడనుండి కడదాక నెంత యేని
యుత్సుకతను గ్రమమ్ముగా నూది యూది
చివరగాఁ దెరఁ దీయుచుఁ జెప్ప నొప్పు
నయిన సర్వత్ర యది సాధ్య మనగలేము

❖

ముగింపు

ఎన్ని యొడిదుడుకులు నైన నన్ని కడచి
బ్రతుకు పండుట భారతభావభాగ్య
మాశ ప్రత్యాశ పెనఁబడి యల్లుకొనుటఁ
గడను మరణమ్ము నొప్పదు గావ్యసరణి

శుభముతో ముగించుట కథాసూత్ర మయిన
నాధునిక కవి సహృదయాభ్యంతరములఁ
గథ విషాదాంతమైనను గ్రాహ్యతరమె
చావుతో ముగించుట కూడ సమ్మతమ్మె

కరుణ వరణీయమైన సంస్కారమొకడు
ప్రజలలో నాటుకొనియె నంబరము నంటి
జాలిగుండెలఁ బుట్టిన వాలె గాని
యది విషాదమ్ము భరియించు నలవు గాదు

పాఠకుని యూహ కందని పట్టులందె
పలికిన ముగింపుఁ గవితకుఁ గళ వెలుంగు
నేకరూపత ఘటనల కేకనిరతి
ఫలసమీకృతి తుద నుండవలెను సుకృతి

మొదలు పెట్టుటనుండి సంపూర్తివరకు
వచ్చు పాత్రలు ఘటనలు వస్తువులును
గట్టకడ సార్థకమ్ములై కనఁబడవలె
నవలలఁ గథల నిది ప్రధానమ్ము సుమ్ము

అద్భుతావహమైన సమాపనమ్ము
తానె జరిపించుకొనుఁ జర్చఁ దనను గూర్చి
జాతి యెదుగుదల బిరాన సాగు దానఁ
బందిరింగన్న తీవియ చందమునను

చెప్పుటయ గాదు తగుచోటఁ జెక్కినట్టు
లాపుటయుఁ గూడ నేర్వంగ నౌను గవికి
నది యెఱుంగమి కథలెన్నొ యణగె నపుడె
జారిపోయిన మురుగుబంగారు పగిది

ముడుల విడదీయవలెఁ, బ్రశ్నములకుఁ దగిన
యుత్తరమ్ముల నీవలె, నుబుసుపోక
పలికిన పలుకులకుఁ జూపవలెను లెక్క
నవలఁ గద ముగింపును గూర్చి యసలు మొదలు

ఒక్క యామని తేనియచుక్క యొలుకఁ
దీయఁదన మెందుఁ జేరెనో తెలుపవలదె?
మన బ్రతుకువలె దాని జన్మమ్ము గూడ
ధన్య మయ్యెడు గతి మదిఁ దలపవలదె?

విశ్వమానవత్వము వెల్లివిరియునట్లు
తన సమాజపుఁ బ్రగతికిఁ దగినయట్లు
పాత్రవృత్తి ప్రవృత్తులు వలచినట్లు
కథ ముగింపుకు నోచినఁ గవిత పండు

కవికి దేవిడీమన్నాలు కలుగ వెపుడు
స్వేచ్ఛ భావించి వచియించు వేది తాను
దాను జూపు పరిష్కృతి తన సమాజ
మునకు నయమార్గదిక్సూచి యనగఁ జెల్లు

తాను తలపెట్టిన ముగింపు తనకె కాదు
తాను సృష్టించినట్టి పాత్రలకుఁ గూడ
నచ్చునట్లుగఁ దీర్చిన నచ్చు గ్రుద్ది
నట్లు పరివృత్తిని సహింప నట్లు నిలుచు

విషయమేదైనఁ దనదైన విధివిధాన
హేతుబద్ధసమాప్తికై యెదురుచూచుఁ
బుడమి రాలిన చినుకులు పులకరించి
మొలకలో దూరి మ్రానులై మురిసినట్లు

నీ కవితాదర్శనమున
రాకాచంద్రికలతోడి రాయిడివలె సం
ధ్యాకారుణికత్వమువలె
లోకమునకుఁ జిత్తశుద్ధి లోఁ గలుగవలెన్

ఒక విలక్షణ దర్శన మొక తెగింపు
నొక విలక్షణ భావన మొక బిగింపు
నొక విలక్షణబంధన మొక లగింపు
నొక విలక్షణకవితకు నొక ముగింపు

బ్రతుకుతెరువుగఁ గైతలఁ బలుకఁ దలచి
మొదలుపెట్టిన వైఫల్యములె ఫలమ్ము
తెలుగునాట జనాలకు విలుచు టింక
బట్టుపడకుంట నది గిట్టుబాటు గాదు

క్రయ్యములె గాని క్రేయముల్ గానఁబడమి
మాటకును జాతికిని లోటు వాటు గతికి
శాశ్వతమ్ముల విలువలఁ జాటెనేని
కవిత కలకాలమును నిల్వఁ గలదు బ్రతికి

కవుల సంఖ్య పెరిగెఁ గవులును బెరిగిరి
ముద్రణములు పెరిగెఁ బొత్తములకుఁ
బాఠకాళి పెరిగెఁ బాపము పొత్తమే
విలుచువారు లేమి నిలకు నొరిగె

ఒకటి రెండైనఁ గొనవచ్చు నో యటంచుఁ
గాని కుప్పలు తెప్పలై కన్నుగొట్ట
నెన్ని కొనఁజాలు నెన్ని సంపన్ను డైన
నదియ తకరారు కవిపాఠకాళి కెల్ల

బండలాగుడు పోటీల బండి లాగు
చక్రగతి నీడ్చి కవితలు సలుపఁ దగదు
గాలివాలున నేగు నౌకల విధాన
సాగవలెఁ బారకస్వాంతసాగరముల

❖

కథనము

ఊర్జితమ్మైన కథ రసాభ్యుదయము నుచి
తార్థయోజనము నవీనమైన స్వీయ
గుణము నక్షరరమ్యత కొసరి కొసరి
కావ్యమున నింపఁ గళ కది కాణయాచి

తెలుపుచును గావ్యభేదం
బుల లక్ష్యము నొక్కశ్లోకమునె చూపెడి మం
దల పూర్వుల శాస్త్రంబులఁ
గలదు కనుకఁ దొలుత ముక్తకమె నేర్వఁ దగున్

ముక్తకము సంచకరువగు ముచ్చటగను
కావ్యములఁ జెప్పి మెప్పింపగా జనులను
మాలఁ గట్టుటతోఁ బాటు మాలఁ జుట్టి
చెండుగాఁ కొండెఁ దలను దీర్చిననె ఘనత

కథను విభజించుకొని రూపకములయందు
హేతుబద్ధమ్ముగా గిరి నెక్కి దిగిన
యట్లు చరియలఁ దాటుచు నద్భుతముగ
సాంగముగ దాని నిర్వహింపంగఁ దగును

చెంబురంగును గుర్తుగాఁ జెప్పునపుడు
రంగులను గూర్చి వివరాలు వ్రాయఁదగదు
కథలలోఁ గప్పదాటులు కలిసిరావు
నవలలన్ శాస్త్రచర్చలు నవఁతఁ గూర్చు

కథను బట్టి కాక కథనరీతినిఁ బట్టి
ప్రీతి గలుగుఁ గవికి ఖ్యాతి గలుగు
నాయుధములు గెలుపు లందియిచ్చునె? యని
వాడినపుడు గాక వాడిచేసి

ఘటనలను యథాకాలమ్ముగాఁ బలుకుట
ఘటనలను యథావసరమ్ముగాఁ బలుకుట
యిటులఁ గథచెప్పు వైఖరి యిరుతెఱంగు
లందు రెండవది ప్రశస్తమై చెలంగు

నాటి పింగళి సూరన చాటి చెప్పె
ననువుగాఁ గళాపూర్ణోదయమ్ము నటుల
చలనచిత్రాలఁ గథల నవలల నేడు
వాసిఁ గను యథావసరవికాససరణి

ప్రతిపదమ్మున జాగరూకత వలయును
గార్యకారణక్రమగతిఁ గథలఁ జెప్పఁ
బాత్ర నిజపరోక్షము నేని పలుకుచుంట
పెక్కుతావులఁ గన్పట్టు పెద్దతప్పు

కవియె వక్త యైనఁ గథనమ్ము తేలిక
పాత్ర వక్త యైనఁ బట్టినట్టె
యాత్మకథల నంత నధ్యక్షమే యౌటఁ
గళవళించరాదు కథనవేళ

పాత్రసంభాషణమ్ములె పరుగుగాగఁ
గొన్ని కథలుండఁ, గవి పలుకులనె నమ్మి
కొన్ని కథలుండుఁ; తొలి తీరు కొంత వెతయ
కవికిఁ బాఠకునకుఁ గాని; కాని మేటి

ప్రాణితనువున యోగలావణ్యమువలె
నమలసౌందర్య మమరుఁ గావ్యములయందుఁ
గాన సర్వత్ర నిర్దుష్టతానయనము
కవికిఁ గర్తవ్య మగు సృష్టికర్తకువలె

ఎడదఁ బొడసూపు తలపుల కెడము గాని
కదలికల మేన జూపింపఁ గలిగెనేని
కవిత యొక దృశ్యమై నిల్చుఁ గనుల యెదుటఁ
గాన ననుభావవర్ణన కవితపస్సు

కవితాలక్ష్యము స్పష్టత
కవిలక్ష్యము స్పష్టపఱచఁ గలుగుట చిత్తో
ద్భవభావంబుల; నప్పుడె
కవి ద్రష్టయు దర్శకుండుఁ గాగల డిలకున్

చెప్పుటయే నీ ధర్మము
గొప్పగ భావించుకొనుచుఁ గోవిదుల కడన్
మెప్పులకై యెగఁజూచుట
చప్పని నీ చిత్తమునకు సాక్ష్యము గాదే

❖

భాష

నిజమనోగతభావమ్ము నిశ్చితముగఁ
దెలుప నే భాషయును జాల దలవడినను
గలలఁ గల్లలనుఁ దలపోతలను వాస్త
వములఁ జెలగుఁ గవిత; యంత పలుక నగునె?

శబ్దమాండలికత సాధు వా బాసలో
వ్రాయనెంచఁ గృతిని బ్రతినఁ బట్టి
యర్థమాండలికత యాదరణీయమే
కోశమందు లేమి కొఱత గాదు

జనపదమ్ముల వినవచ్చు సహజభాష
గ్రంథములఁ గోశముల యందుఁ గానరాదు
కాని మూలసంపద యది కాదె భాష
కంతరాలయస్థితవిగ్రహమ్ము పగిది

సతతము నుత్సవమూర్తుల
నతిశయముగఁ దీర్చి మురియు టలవాటే యా
గతి భాషలకుం బట్టినఁ
గృతులుత్సవమూర్తులే సరీసృపగతులే.

పదుగురాడుమాట పాటియై ధరఁ జెల్లు
ననెడి మాట కృతులయందుఁ దగదె?
పలుకు నట్టి పలుకు పలుకుగా పలకదే
ప్రజలఁ బలుకరించి పలికినపుడు

యాస యూనిక పలుకుట యందె నిలుచుఁ
గాన వాటిని వ్రాయుట గాదు సులువు
కాని పదపదబంధముల్ కాపుదలను
నిలువకుండిన జాతిభాషలకుఁ జేటు

కోశములలోన నుడులుండుఁ గోట్లు కాని
వాచ్య లక్ష్య తాత్పర్యసంపద నెఱింగి
వాడుకను బట్టి పదముల వాడవలయు
సూటిగాఁ బాఠకునిఁ జేరఁ జూచితేని

శైలి భాషయు జోడుగుర్రాల పగిది
సాగగా వలెనింతయు నోగులేక
భావమును గూడ జతగూడ భవ్యమగును
త్రిపుటివలెఁ దత్త్వదర్శనోత్తేజ మగును

తెలుగుపలుకుబడులు తెలుగుజాతీయాలు
తెలుగుప్రాసయతులు తెలుగునుడులు
మాతృభాష యగుట మన సిరిసంపదల్
వాని విలువ లెఱిగి వ్రాయవలయు

గ్రంథములను జూచి గ్రహియించి పదములఁ
గూర్చెఁ బండితాళి కోశములను
బల్లెనుడుల నేరి బదనాయ మనుకొని
కైత లల్లఁ గవులె కదలవలయు

తమకుఁ జుట్టుపట్లఁ దామరతంపరై
చెవులఁ బడెడి నుడుల సేకరించి
మరల జనుల చెవికి మరలింపఁ గలిగినఁ
గవికిఁ గావ్యమునకుఁ గలుగు వెలుగు

❖

పదం

జలదము గ్రక్కిన జలముల
వలెఁ బదములు కవితలందు వరలగవలె; న
త్తల నిత్తల నత్తలవలె
వలఁ జిక్కిన చేపగుంపువలెఁ దగదు గదా!

ఆకర్ణాంతాకర్షణ
లేక ధనుర్ధారి శర మలీకత విడువన్
వీకం జూపునె తద్విధి
నీకుం దగుఁ బదము లాగి నిలుపఁ గవితలోన్

అక్షరమ్ముల పెనవేత యసలు కవిత
భావముల సమన్వయము విద్వత్త ఘనత
కోట్లకొలదిగ రూపాలు కొలువు దీరు
నలలు నలలుగ వ్యక్తిత్వములును పొగులు

అక్షరమ్మొక్కటైనను నర్థబోధ
కమ్మె ప్రత్యయబల మది; కవిత నైన
వర్ణమొక్కటి భావసంపదల నెల్ల
త్రవ్వి తలకెత్తఁ జాలు సంస్థానవశత

ప్రత్యక్షర మన్యాక్షర
మత్యాదృతిఁ జొచ్చి యొక్కటై భాసింపన్
నృత్యత్ప్రాయమనోజ్ఞ
స్మృత్యంకితసత్కవిత్వసిద్ధి యెసగెడున్

దూదిపింజలు గాలిలోఁ దూలినట్టు
లత్తపత్తి కరస్పర్శ నణగినట్లు
నీటఁ గనకాంబరపు గింజ నిగుడునట్లు
భావమును బట్టి బంధానుబంధనములు

రససిద్ధి యక్షరమ్ముల
పసవలనను గూర్పులోని స్వచ్ఛతవలనన్
గుసుమించి పరిమళమ్ములఁ
బ్రసరించును భావుకాంతరంగపథములన్

ప్రతిపదము సార్థకమ్మై
వితమున నిక్షిప్తమైన వింతగ నదియే
జతయై భావోద్దీప్తికిఁ
గతిపయపదవృద్ధిఁ దోడుగా నర్తించున్

విరిసినగతి విరు లరులును
మెరిసినగతి మెఱుపుఁ దలపు మీగడలు గడల్
కురిసిన గతి పదయోజన
మరకొరర గాకుండ పద్యమం దమరవలెన్

పదములు షట్పదముల వలెఁ
గదియుచుఁ జెవిపొంత గుప్తకథకుల వలె నె
మ్మది నాలోచనములఁ బూ
పొదరింటినిఁ దట్టి లేపి పొలయగవలదే?

ఒప్పైనను నప్పనిచోఁ
దప్పుగ భావించి విడువఁ దగును పదంబున్
నప్పుటయే రససిద్ధికి
నొప్పిదమగు కారణము మహోత్సవపదమున్

పదములు పొదుపుగ ననువుగ
నొదిగినఁ గద భావమెల్ల యొదుగుట జతగా
హృదయము ధిషణయు నొకటై
కదలినఁ గద స్థితియు గతియుఁ గన నగు సరిగాన్

పంచాననసంచారము
లంచితముగ నడవిఁ గాచినట్టుల ననిలోఁ
బంచాస్యవిక్రమంబున
వంచిన విలువెలలు నమ్మవలెఁ పదగతియౌ

"ఆరయ భువిలో మహిలో నటంచు నెంచఁ"
దెలుగు తుహిచలు వదలగా వలయు వాని
నటుల నవధారణసముచ్చయార్థకముల
వ్యర్థములఁ ద్యజింపవలెఁ బద్యములయందు

పాదపూరణమాత్రప్రవర్తకములు
నొక్కచో రసమాధురీయోజకములె
తత్త్వము నెఱింగి సాధకతమము లట్లు
వాని గ్రహియింపఁగాఁ జాలి రేని కవులు

భాష మార నసభ్యమ్ము భాష్యపదమె
జనము లొప్పుట వాడగ జంకకుంట
రేపుచేసినఁ దెనుగున నోపలేము
లంచి డిన్నర్లు లేక జీవించలేము

కూడు కుడవలేము గూడు పీకగలేము
మీల్సు చేయకున్న మెసలలేము
మోము మనగ నీము మొగసాలలోపల
కారిడారులోనె కాంచగలము

వ్యాకరణము మెచ్చు భాష పండితులకు
ధిషణ మెచ్చు పదము దివ్యపదము
పరవశించి పాడు బాస పాటల కింపు
జనము మెచ్చు పదము జానపదము

గోవు నడచుచున్న గోవు పరుండిన
చంగనాలతోడ సాగుచున్న
గోవు గోవె దాని గోత్వజాతిత్వమే
గోవు నా వచింపగా వెలయును

సదృశతాబల మశ్రుతాంజలినిఁ గూర్చెఁ
దెలిసియుఁ గృతజ్ఞతాంజలి నిలువవలదె
పుట్టుపదముల వలె నట్టిపెట్టుకొనెడి
పదము లైన బాసల పెంపుఁ బ్రబలఁజేయు

నుడుల కలిమి పలుకుబడుల హెచ్చించును
బలుకుబడులు నుడుల బలముఁ బెంచు
నుడులు పలుకుబడులు నూత్నసాహిత్యసం
సృష్టిహేతురూప మిష్టపడును

❖

లయ

స్వరభంగము విపరీత
స్ఫురణకుఁ గారణము గాన సుందరకవితా
ధ్వరమున స్వరసత్త్వంబును
బరమాదరబుద్ధి నెఱిగి పాటింపవలెన్

ఒక యూనికతోఁ గవితను
బ్రకటించును గవి యనన్యభావన నా నూ
నిక మతి గమనింపనిచో
నకటా! కూర్పరికి నైన నవగతమగునే?

పలికెడి నుడి వైఖరిలో
నలయని స్వర ముండు దానియందుఁ బరార్థ
ప్రలయము నది విస్ఫోటన
ఫలమై ప్రభవించువఱకుఁ బలుకు చెలగెడిన్

ఒక నుడి యొక నుడికారము
నొక వర్ణక మొక్క వర్ణ మొక సంబంధం
బొక యూనిక యొక కలయిక
యొక పోలిక యర్థకోటి నుత్పాదించున్

కాఱుమబ్బులు మెలమెల్లఁ గదలినట్లు
గాఢతనుబంధసుందరాకారగతుల
భావలయ హృదయాకాశపథమునందుఁ
గదలవలె నవిచ్ఛిన్న సంగమన యగుచు

శ్రుతిలయలు తోడుమాడుచు
వ్రతగతి సంగీతసారభరము వహించున్
శ్రుతిభావలయలు పెనగొని
కృతమతి సాహిత్యసారకీర్తి భరించున్

హృదయదఘ్నమై భావన మెసగవలయు
ధిషణ నికషగాఁ బదములఁ దీర్చవలయు
కర్ణపర్వమ్ముగా శైలి కలియవలయు
గుండెలను దాకు కవిత లోగుట్టులివియె

ఎట్టి లయలోన భావింతు వట్టి లయను
గురుతుపట్టెడి తీఱునఁ గూర్చు వలయు
నటులఁ గాకున్న రచయిత కైనఁ గాని
పద్యభావమ్ము సుంతయుఁ పట్టుబడదు

భావలయ భావభంగిమన్ భావగతినిఁ
దత్సమాఖ్యాతి శబ్దసందర్భనమును
బదనిబంధనన్ రసహేతుబంధనములఁ
బ్రత్నమైనను నూతనత్వమ్ము గూర్చు

చిందువేసిన రీతి నిష్యందమాన
మధుపృషతము మెల్లగ దిగు విధముగాను
మృదుసమీరపుఁ దాకిడిఁ జదల నాకు
కదలినటు లెడందల లయ మెదలవలయు

భావలయకు భిన్నంబుగఁ బదము లున్నఁ
బాఠకుడు క్రిందుమీదలఁ బడును దెలియ
వ్యర్థమైపోవు భావనాబలము గూడఁ
జెట్టుకడకొమ్మఁ గల తేనెపట్టుపగిది

అలకల కదలిక లందునఁ
గల యందము సవరణమున గల యందంబున్
గలకలిపి కాంచినప్పుడె
తెలియగనౌ లయను శైలిఁ దిరమగు సొబగున్

భావనమ్ము విక్షేపణ పాలబడిన
నెగుడు దిగుడగు రూపు గట్టగఁ గుదరదు
కవిత యతుకుల బొంతయై కలతఁ గూర్చుఁ
గడకుఁ జెడిన పుత్రుని వలెఁ గథలవలెను

పండుటాకులు పంటకాల్వలను రాలఁ
దనియు జలముల మృదులవృత్తములు చెలగు
నది లయాత్మకజీవన మట్టిలయయె
యెదను బుట్టెడి భావసంపదల వలయు

భావము

పునరుజ్జీవన కవితం
బనితనమే కాని స్వీయపదవిన్యాసాం
గణమున భావంబులు న
ర్తనఁ జేసిన యెడల యోగ్యతల నది పొందున్.

కృతి మహోన్నత యైన నాకృతిని బట్టి
యక్షరములందు నేబదియయిదు మటుకె
వ్యక్తి యున్నతు డయిన భావాల కలన
భావములు మాత్ర మేబది భరతనీతి

భావపదము సాంకేతికతావిభూతి
స్వాంతమునఁ బుట్టు తొలితొలి స్పందనమ్ము
వరలుఁ దాత్పర్యపర్యాయపదము గాను
స్పష్టతను గూర్చి పల్కుటఁ బలుకులకును

ద్రవ్యగతగుణకర్మాదిదర్శనమ్ము
తత్ఫలీభూతదృశ్యచిత్రణము గూడ
భావపదవాచ్యమై వాడబడుచునుండుఁ
గవులచేఁ బాఠకులచేతఁ గవితలందు

కనిన వినిన నూహించిన క్షణమునంద
యెడదఁ గల్గెడి తొలిమార్పువిడిది భావ
మదె ప్రమాణము చేతనాభ్యుదయమునకుఁ
దుహినకిరణకరస్పర్శఁ దొగలకువలె

సొన జారుట నన విరియుట
కను విప్పుట కలవరింత కలమ విరియుటల్
దొన మినుకుట కొన ముగియుట
పనితనమా? కాదు భావపరిణామంబే

పొల మారుట తల మారుట
కల చెదరుట పలకరింపుఁ గథ నెరయుటలున్
శిల యలుగుట యులి యులుకుట
తలమా తెలియంగ భావతలపరిణతులున్

స్థావరజంగమప్రతతితంబగు భూవలయంబు నందులో
జీవులు తత్ప్రవృత్తిగతచేతన యందలి వ్యక్తిబృందభా
వావిలతల్ పవిత్రతలు నందలి కృత్రిమతాయథార్థతో
ద్భావనలుం బదార్థముల తత్త్వముఁ దెల్పఁ బురోగమించెడున్

ద్రవ్యతత్త్వ మెఱుంగ నాంతరముఁ దెలియ
వలె నుపరితలస్పర్శచే వలనుపడునె
అలలఁ దాకిన యంత లోతులను దెలియ
గలమె యడుగంటఁ గాలూనవలెను గాక

ఘటన మొక్కటె సంస్కారఘటనవలన
ప్రాణులందున భిన్నభావాలు చెలగు
భిన్నభిన్నముల్ స్పందనల్ పెచ్చు మీఱుఁ
గలలు కలవరింతలు భిన్నకళలఁ బెనగు

చినుకు జారుట నొక్కడు గని మురియును
చినుకుపాటును నొక్కడు గని చెదరును
చినుకు చితుకుట నొక్కని మనము కలగు
నేల నింకుట యొక్కని జాలి జడుపు

దార్శనికతను వస్తుసందర్శనమున
వరదవలె భావనలు రేగవచ్చు నెడద
వాస్తవికతను హేతుసంవర్తనమున
నింపి సరిచూచి వ్యక్తీకరింపవలదె?

హర్షులములు భానంబులు
వార్షుకజలదముల భాతిఁ బ్రతిరసగతులై
మర్షితములై సమీహిత
కర్షణపర్యంతవర్తకములై చెలగున్

జీవనము నిత్యనిర్భరభావవనము
స్తబ్ధమును, యోగ్యకారణస్పర్శవలన
తరలమై తరంగితమయి తనరు స్వాను
గతరసానురూపమయి సంగతము నగుచు

కవితలోన్ క్షేత్రమందునం గలుపుతీత
ముఖ్య మటుగాక వదలినఁ బోను పోను
కలుపుపంటలె పంటలై వెలుగు వెలుగుఁ
బరిగపాటియు నసలైన పంటరాదు

తెలివిమీఱిన భావాల తెవులు గూల్చు
శాస్త్రలోకనీతుల సమాస్వాదనమున
హృదయ మెఱిగిన మర్యాద లెదురులేక
భావనము సాగు చతురస్రబంధముగను

మనసు చెదరి యున్న మలినమై యున్నను
భిన్నకారణముల ఖిన్నమైనఁ
గవితలోని రుచిని గ్రహియింపఁ జాలదు
దుమ్ము గొన్న దర్పణమ్ము పగిది

అన్యభావన, జీవన మన్యము, కవి
పాఠకులు నన్యులు, నిజానుభవము కాదు
భాష యేదైన కవిత యాస్వాదనీయ
మగుట హేతువు దాని విశ్వాత్మకతయ

విశ్వవాస్తవాలు విశ్వప్రకల్పాలు
మనిషి యనుభవాలు మననగతులు
భావరూపకల్పనావాస్తవికతను
దెలుపు నిలుపు మలుపు కలుపుతీసి

ప్రాణిలోని స్వార్థము విశ్వవాస్తవమ్ము,
తల్లి ప్రేమను బొగడుట తరుగువోని
యద్భుతప్రకల్పన, మనాయాసముగను
కద్రువ సుతుల శపించుట కఱకు నిజము

తండ్రికిని జీవమాత్రత తత్స్వరూప
మమరభావన సంస్తుతి యద్భుతప్ర
కల్పనమ్ము, యయాతియు గాధిసుతుడు
సుతుల శపియించుట రుషను స్థితి ఋతమ్ము

తండ్రిమాట వినగఁ దలపడు ప్రహ్లాదు
డందుకొఱకె రాము డడవి కేగె
నెవడు మేటి? మనకు నేది యాదర్శమ్ము?
తరచి చూడఁ దగును ధర్మపరత

కోతిశావాల మానవనీతి రీతి
యెఱుగగా లేక రాముడే వెఱగుపడెను
గానఁ బరకాయముల దూరి కాంచి భావ
తత్త్వ మరసి కవిత వ్రాయఁ దగును గవికి
(కోతిశావాలు=కోతిచేష్టలు.. నెల్లూరు వాడుక)

రిక్కల నల్దిక్కులలో
లెక్కకుఁ గొననెంచు వేళ లీలగ నెదలో
నిక్కెడి యుత్సుకత వలెన్
జక్కన యగుఁ దలపు పుట్టు సమయములోనన్

అసురసంధ్యవేళ నటు దోగుచున్ గ్రమ
క్రమముగాను కంటిఁ గప్పి వైచు
భానుబింబము వలె భావపు పోబడి
యందగించుఁ గవిత లందు విందు

రెండు భావముల్ సమశక్తి నిండి యెదదఁ
బట్టిపీడింపఁ జాలిన యట్టి కవిత
గాటముగఁ బాఠకునిలోన నాటుకొనదె?
రెండు కొనల నయస్కాంత ముండినట్లు

ఒక్కసారిగఁ దూనీగ లుర్వినుండి
నింగి కెగసిన తీరున నిలువఁ బెక్కు
భావనలు పరస్పరబలవర్ధకములు
నదియె ఘర్షణ కవితల కందగింపు

ప్రతిభావ మన్యభావపు
జతయై సయిదోడు లనగఁ జనవలె గవితన్
బ్రతిమల జత కూడిన గతి
ఋతువులుఁ దత్కాలసుమము లేచిన పగిదిన్

నేలతాకిడిఁ బులకింత, నీటివాలు
లోని రసవత్త, నిప్పులోఁ గానవచ్చు
నూర్ధ్వగమనప్రియత, నింగి నున్న విస్తృ
తప్రకారత కవితనుఁ దాకవలయు

గాలివాటముగా వ్రాయు కవిత గూడ
చిఱుతకరువలి వలె నెదఁ జీరఁ గలదు
భావమును బట్టి స్వాంత ముజ్జ్వలితమో, ద్రు
తమొ వికసితమో విస్తారితమ్మొ యగును

కడ దాక సమస్థాయిని
నడవగ వలె భావన మభినవమై కంటం
బొడమిన నీటినిఁ జేతం
దుడుచిన గతి ముగియఁ జేయ దొరకొనినఁ జెడున్

భావ మాత్మీయ మైనచో పటుతరమగు
కారణమున సాధారణీకరణ మొప్పఁ
జెప్పగాఁ దగు మామిడి చేదునాగఁ
బలుకఁ దలచిన హేతు వావశ్యకమ్ము

ఒకట భావాల హోరు పెల్లుబికి వచ్చు
గట్టు దాటిన నదివోలె గతిఁ జెదరుచు
నపుడు వ్రాయుటకన్నఁ దా నట్టెవిడుట
యుత్తమకవిత్వనిర్మితి నొక పథమ్ము

భావనము నీది సృష్టిసంభావనమునఁ
బాఠకుని గుండెచేరువవలన నిలుచు
నవల నిలువగ గోడచేరువలె వలయు
కెరలుజిగి నపరంజి పళ్ళెరమునకును

ఎక్కడో గుండెలోపల నింత చెలమ
భావము పదాల పట్టుతోఁ బైకుబుకును
మరలఁ బ్రవహించి పాఠకమానసముల
నించి యానందసుమము పుట్టించుచుండు

పాఠకుడు తటస్థుడె కాని పక్వభావ
ఫలరసాస్వాదనమ్ము నా భావుకునిదె
తానె తద్భావభావితాంతరత సర్వ
మగుచు కవిభావనకు స్థితి నమరఁ జేయు

భావ మెంతటి దైనను పంచుకొనెడి
తోడు లేకున్న నది తన నీడ యగును
పాఠకుడె తోడు భావమ్ము పంచుకొనగ
పాఠకుడె నీడ భావమ్ము పదిలపడగ

ఎదనుఁ గదిలింపగా వలెఁ బదనుదేరి
లోతులను దాకగా వలె నీతి నెఱిగి
చింతనలఁ బ్రోదిచేయుచుఁ జెలగవలెను
భావనము భావ్యమానమై భావమగుచు

కవితలందు రసముకన్నఁ గమ్మనైన
భావమే సూటిగా గుండెఁ బట్టగలదు
భావ మందున దృష్టి భావంబు నందె
యాధునికకవితల నదె యసలు సొగసు

భావరసముల సరి వేరుపఱచి చూపు
టంత తేలిక? తారతమ్యమ్ము మటుకె
నిర్ణయించును దాని; నా నీతినెఱిగి
కవితలన్ గావ్యమున్ వ్రాయు కవి ఘనుండు

చిల్లపెంకులు చెరువులోఁ జెంగనాలు
వేసినట్లు భావంబులు వేల గతులఁ
గవితలోఁ జెంగలింపంగఁ గలిగెనేని
మొదవుగాఁ బాలకడలిగా మురియుఁ గవిత

కుదురుకొనఁ జేసికొని భావ మెదను బిదప
వ్రాయఁ బూనినఁ బొందిక రాజ్య మేలుఁ
గవిత కర్పూరకళికయై కళలఁ బంచుఁ
బలుకుబారని యన్నమువలె రుచించు

❖

గుణదోషాలు

పానకము నందుఁ బుడకలు పద పదార్థ
వాక్య వాక్యార్థ దోషాలు బహువిధములు
కవిని నవ్వుల పాల్సేయగలవు కొన్ని
పఠిత యనుభూతినిన్ భంగపఱచుఁ గొన్ని

అనుచితవర్తనభాషణ
మననమ్ములు దేశకాలమతహితవిద్యా
గుణసంగ్రహవైఫల్యము
లను దోషము లండ్రు కవితలన్ గనుపట్టన్

భావమైనను రసమైన భాషణమ్మొ
నైన ధ్వనియైన గుణమైన నదుపుదప్పి
భంగపడవచ్చు ననుభూతి భంగపఱుప
వచ్చు నది గ్రహించి కవిత వ్రాయవలయు

మల్లెమొగ్గల వర్ణన తెల్లవార
మకరసంక్రాంతి మామిడి మధురిమములు
చెలమఁ ద్రవ్వుట మరుభూమి జలము గోరి
యనుచితమ్ములె యనుభూతి నడ్డగించు

పామరుడు వ్యావహారికభాష విడుట
పాత్రలన్నియుఁ గవిభాషఁ బలుకుచుంట
స్థాయి మించిన భాష పాత్రలు పలుకుట
యనుచితమ్మలె యనుభూతి నడ్డగించు

వాక్యనిర్మాణమందు వివక్షితార్థ
మునకుఁ గల యట్టి ప్రాథమ్యమును గ్రహించి
కర్తృకర్మక్రియాపదక్రమముఁ గూర్ప
కున్న భావసంక్లిష్టత వెన్నువిఱుచు

డొంకతిరుగుడు మాటల వంక మోజు
పడుచు పద్యమో వాక్యమో పట్టి లాగి
సాగఁ దీసిన దొసగది సాగఁ దీయఁ
బోయి తీగలఁ ద్రెంపెడి పోడిమి యది

భక్తిభావన మతిశయింపగ నటు నిటు
వట్టి సంబుద్ధిపదముల నట్టి పెట్టి
కవిత యని దబాయించుట కాదు కవిత
భావశూన్యత దోష మా తావులందు

నుడి ముడి నిడి గణమును లెక్కిడుచు తీరు
గ మరొక నుడి కలిపి దాని గణవిభజన
నేర్పు చున్న గతి కవితానిర్మితిఁ గనఁ
గుంటినడక దొసం గటఁ; గుములుఁ గవిత

రూపకము రూపకము మీద, రూపకమ్ము
దానిపై నిట్టి ధోరణి కానిపించు
వచనకవితల; నొప్పె కావచ్చుఁ గాని
భావనానవస్థ కలచుఁ బాఠకులను

పాఠకుని లోని పాండిత్యపటిమఁ బట్టి
పదమునందలి దోషమ్ము బయటపడును
భావమునొ రసమ్మునొ భంగపఱచు శక్తి
దాని కుండమి నది నియతమ్ము గాదు

వాక్యదోషమ్ము తాత్పర్యభంజకమ్ము
కవివివక్షకు భంగమ్ము గలుగఁ జేయు
దాన ననపేక్షితార్థసంధాన మగుటఁ
గవికిఁ గవితకు భంగపా టవుచునుండు

అర్థదోషమ్ము నియతమ్ము ననియతమును
విదిత మది భావతాత్పర్యవేధయ యగు
నర్థసంబద్ధదోషములందుఁ గొన్ని
దోషముల్ పాఠకులకును దోచినపుడె

తోచనంతమాత్రమున నా దోషబలము
తగ్గ దది నశింపగఁజేయుఁ దత్త్వబుద్ధి
వాస్తవికత నెఱుంగమిఁ బాఠకుండు
దారితప్పిన యొక బాటసారి యగును

దొసగు లుండినం గవితలఁ బస చెదరదు
రసమహత్తయు దర్శనప్రాభవమ్ము
సముచితమ్ముగ సాగి వాస్తవిత కొరిగి
మనసుఁ జేతన నాకట్టుకొనఁ గలిగిన

❖

కవితాతత్త్వం

జగతిం గూర్చు క్రమమ్ములో నిఖిలవిశ్వవ్యాప్తచైతన్యమం
దు గణేయంబులు వేనవేలు సృజనల్ దోపట్టు నవ్వాటిలో
నఁ గవిత్వంబును నొక్కడై చెలగు నన్నా! యంతమాత్రానికే
తెగ నీల్గం దగునే పరస్పరసభాతీరాల నీతాడుచున్

అందరికి దెలియఁగా వలె
నందువు కవితావిశేష మది యుక్తంబే
యందరన నెవ్వ రన నే
మందువు విరళప్రకాశ మది తర్క్యంబే

వివిధవిబుధమస్తిష్కభావితగుణమ్ము
కావ్యతత్త్వమ్ము భిన్నమార్గాల నడచెఁ
బ్రతిపథమ్మును నిండైన ప్రగతిపథమె
కళ్ళముందున్న కైతలఁ గన్న ఫలమె

నిలకడలు లేని యీ బ్రతుకులను గూర్చి
వ్రాసి నిలద్రొక్కుకొనవలె వాసిఁ గవియు
బ్రతుకు సమసినన్ సమయదు కృతి; యయాతి
తపనవలె దివి నొక్కరేన్ దలప భువిని

ప్రకృతిచతురతఁ బసికట్టి ప్రతికణమునఁ
బ్రాథమికముగ శాస్త్రసారమ్ము దెలిసి
వివిధవృత్తిప్రవృత్తుల విధ మెఱింగి
వ్రాసినం గైత నొకపాటి ఫలము దక్కు

కనులఁ దెగఁ ద్రిప్పి చూచినన్ దనదు కంటి
ఛాయఁ దక్క రూపము గన సాధ్యపడునె
యెంత నేర్చినవారల కేని యింక
నన్యతత్త్వమ్ము లెఱుగుట యంత సులువె?

తత్త్వశాస్త్రహృదయతత్త్వశాస్త్రమ్ముల
సారమరసి కావ్యసరణిఁ దెలిసి
వ్రాసి నట్టి కవిత పాఠకుని యెడంద
నిలిచి శాశ్వతత్వఫలముఁ బడయు

కొన్ని కావ్యములను గొన్ని భాగంబులె
పేరువడయ నదియ కారణంబు
కథను మించి పాత్రకలితతత్త్వంబె యా
తావులందు మిగలఁ దావులీను

బాహ్యప్రకృతిని వర్ణించి పాఠకులకుఁ
బ్రీతిఁగల్గించు టంత తేరికియుఁ గాదు
దానికిం జేతనత్వమ్ము తగులఁ జేసి
పలుకరించిన నది విందు; తలపు పండు

కేవలతటస్థవర్ణన భావరహిత
రూపవర్ణన దానికి మోపుచేసి
చేతనత్వ మాపాదించి చెప్పినపుడు
కవి మహాకవియై వెల్గఁ గలడు సతము

కని విశ్వము సాకల్యము
గను దన మనమున మథించి కర్మరతత్త్వం
బును నలుగురికిం జెప్పం
జను కవి వేదాంతి కాడ? జనహితమతియై

బింబమో ప్రతిబింబమో వెక్కిరించి
నట్టు లనుకరణమొ యథార్థానుకరణ
మో ఫలానుకరణమొ సామూహికాత్మి
కానుకరణమొ కవిత విశ్వాత్మకృతికి

కవికిఁ బాత్రకు ఘర్షణ కలిగి నపుడు
పాత్రలను నేకవాక్యత పలకనపుడుఁ
గవి తటస్థుడు కావ్యప్రకారమైన
సత్య మొక్కటి యచట సంస్థాప్య మగును

ప్రకృతిచతురతఁ బసికట్టి ప్రతికణమునఁ
బ్రాథమికముగ శాస్త్రసారమ్ము దెలిసి
వివిధవృత్తిప్రవృత్తుల విధ మెఱింగి
వ్రాసినం గైత కొకపాటి ఫలము దక్కు

పరులొసంగినట్టి పదమొ వాక్యమొ పట్టి
పద్యవచనములను వ్రాయుటన్న
పరుల బాటపట్టి పరుగులెత్తుట గాదె
మంచి సెబరఁ దెలియు మార్గ మేది

దత్తపదులలోనఁ దగిన వ్యుత్పత్తి స
మస్యలందుఁ గొంత మసలుఁ బ్రతిభ
స్వీయకవితలందుఁ జెలగు వ్యుత్పత్తియుఁ
బ్రతిభ వలసినట్లు ప్రథిత మగుచు

చిత్రకవితావిశేషముల్ చెలగు నెన్నొ
కవికిఁ బాఠకునికి నవి కంఠశోష
కవిత గాఢాంధకారసంస్కారశిఖరి
రసముఁ కనలేము తెలియము పసదనమ్ముఁ

శబ్దచిత్రము ప్రౌఢిమ సమము కావు
పదముపై లోభ మొకటి వ్యుత్పత్తి యొకటి
చిత్రకవితలో ధీశ్రమ చెలగిపోవుఁ
బాఠకుని గుండె చిద్రుచును వదలిపోవు

కవితలో వెల్లియైనను గడలియైనఁ
గాఋమబ్బైన నెలవంక గారమైన
నిరులు కురిసిన వెన్నెల సిరులు నైన
నొక్కటే సాంద్రసమ్మోద మక్కజముగ

విధి సృజించిన ప్రకృతి యా విధివిధిగను
సాగు కడలిలోఁ గెరటాల సరణిఁ; గడలి
జలము లావణ్యభర మనాస్వాద్య మదియ
కవి సృజించినఁ బేయమున్ సవురు కిక్క

పరమరమణీయభావనాభ్యాసగరిమ
సర్వకళలకు నూపిరి సాధనమ్ము
లెట్టి బాహ్యోపకరణము లేని లేక
కవిత ప్రభవించి జీవింపఁ గలుగుఁ జిరము

విరి పరాగము తేనియ పిందె కాయ
పండు రసమును ననుండి ప్రభవ మందుఁ
గ్రమవికాసముఁ గమనింపఁ గల్గు కవికి
నచ్చమైన రసస్పర్శ మచ్చికగును

నిదుర పట్టదు ,పట్టినన్ నిలుపు లేని
కలల సందడి, కలలలో నలుపు లేని
విశ్వకళ్యాణవేదికల్ వేడుకలును
మెలకువన సానబట్టుటా కలలఁ గవిత

తరువు నిన్నటిదైనను దలిరు క్రొత్త
తావి నిన్నటిదైనను బూవు క్రొత్త
కవిత నిన్నటిదైనను గలిమి క్రొత్త
కాల మిసుమంత కరగినఁ జాలు క్రొత్త

కవి – పాఠకుడు

ఎవరికొఱకుఁ గవిత్వమ్ము లెదిరికొఱక
కాక తన కోసమా? యెట్లు కాంచగలము?
తెలిసినన్ గట్టు కవిపాఠకులకు మధ్య
మనకుఁ జొరబడి మాటాడ మనసు పుట్టు

అసలు కవితకుఁ బాఠకుం డవసరమ్మ?
పొలములోననొ తలమందొ పొటమరించు
నచ్చపుం బాటకున్ శ్రోత లచట నెవరు?
కైతకుం బాఠకుడు నిజాకాంక్షఁ బుట్టు

వస్తుసందర్శనమ్మున వాస్తవికతను
భావనము చేసి కూర్చు రూపమ్ము సుకవి
రూపమును జూచి పరిశీలనోపపన్న
చర్వణము చేతఁ దనియు నాస్వాదకుండు

కవి రచించెడి వేళ లోఁ గనిన తలపు
పాఠకునిలోనఁ గనుఁ బరివర్తనములఁ
గవియుఁ గాని యూహించని క్రమభావ
మైనఁ దళుకొత్తుఁ జదివెడివానియందు

గొలుసుకట్టులు కవితలోఁ గల సొగసులు
దలపులును గొనఁ గొనఁ గొన వెలికివచ్చుఁ
బాఠకుని చిత్తమునఁ దోచి పసదనమ్ము
జేదుకొనువారి భావన చేదినంత

మూలమున భావనల పుట్టి మునిగి యున్న
వ్రాతలో సత్త సరసజీమూతమున్నఁ
కవి మహోన్నతుఁ జేయగాఁ గలుగుఁ బఠిత
కవియు నూహించియుండని కథలఁ జెప్పి

కావ్యసౌందర్యసంస్థితి కవితయంద?
పాఠకుని నిత్యభావనాపథమునంద?
యుభయసంబంధమం దది యుండుఁ గాన
నొకడు మెచ్చిన కవిత వేఱొకడు దెగడు

ప్రౌఢిమను మెచ్చు నొక్కడు ప్రౌఢిఘనుడు
మెచ్చు లాలిత్య మొక్కడు మృదులహృదుడు
కవియుఁ బాఠకుడైన సంస్కారవశత;
నందు గుణదోషముల చర్చ యనవసరము

ఇన్ని నడ లిన్ని రంగులు నిన్ని రుచులు
గలుగఁ గారణ మభిరుచి వలని నెమ్మి
కవితలను నట్లె భేదముల్ గదను ద్రొక్కు,
నైన నందరి గురి తుల్య ;మదియ ప్రగతి

ఒకడు ప్రాచీనతయె మహాయోగ్య మనగ
నొక డది యయోగ్య మని చెప్పు నూసు లెన్నొ
సమసమాజమె యొక కవి సాధ్య మనగఁ
దనువు లందైన సమత లేదను నొకండు

మార్గములె వేరు గమ్యమ్ము మాత్ర మొకటె
కందువలు వేరు స్పందనానంద మొకటె
కాలువలు వేరు కలిసెడి కడలి యొకటె
హితములే వేరు హితకాంక్ష నెసగు టొకటె

❖

నవకథాదృతి

ప్రతిభలోనఁ గలదు పాంచభౌతికవిశ్వ
మంత; కవిత దాని యంత గాదె
యజుని సృష్టి మించు నానందసందర్భ
మది యనాది భవ్యమైన యాది

విశ్వసాహితిఁ గల కథల్ వేన వేలు
కొసరు తునకలు తుంపులు కోట్లు కోట్లు
నెక్క డెక్కడో దాగి యే లెక్కలేక
కథకులకయి నిరీక్షించు కథలు నెన్నొ!

పడిన చినుకు గాని వడిలేచు సడి గాని
తడియు నేల గాని తావి గాని
మొలుచు మొక్క గాని తలపు తాకిడి గాని
కథల నిద్రలేపఁ గలుగుఁ ద్రుటిని

తాను గనుపట్టు సృష్టిభేదమును బట్టి
తననుఁ జూచెడి దృష్టిభేదమును బట్టి
యొక్క జీవియుఁ దానొక యిక్క లెక్క
లెక్కలేనన్ని కథలకు రిక్కలవలె

ఒక్కచూ పెదో రీతిగ నెక్కడేని
వాలినం జాలుఁ గథవెల్లి జాలువారుఁ
గథకుఁ దగనిది పుడమిలోఁ గలిమిఁ గనదు
లేమి మన భావనల లోతులేమి మటుకె

ప్రతిజీవిత మొక కథయే
ప్రతిజీవియు నొక చరిత్ర ప్రతిధృతి కథయే
ప్రతివర్తమాన మొకకథ
ప్రతిభీతియుఁ గథలపుట్ట బ్రతుకుకథలకున్

వ్యాసవాల్మీకు లిద్దరు భారతీయ
లౌక్యసాహిత్యబహుకథాలంబనములె
యొండు రెండుండు కవిమేధనుండి పుట్టి
బ్రతికి బట్టగట్టిన కృతుల్ పదిలముగను

విద్దెలన్నేర్ప నలనాటి విష్ణుశర్మ
పుట్ట కథలకుఁ దెల్వికి గుట్ట మిట్ట
యెన్ని విన్నాణముల్ సూపె నిహగగతుల
జంతుమతులను విజ్ఞానసంగతులను

నవకథల? నవరసమ్ముల?
నవజీవనకల్పభావనాకలికములా?
స్తవనీయమ్ములు కృతులం
దవికలరసభావసిద్ధికై కవిచేతన్

భావహృదయదఘ్నత కవిత్వప్రణాళి
నవకథల కన్న నవభావనమున సిద్ధి
సిద్ధి రసరూప మనుభవశేవధి యది
యేకఘనముగ గుండియ కెక్కవలయు

ఒక పురాతనకథఁ గొని యుక్తి నుక్తి
వింతగాఁ గ్రొత్తఁదనమును వెలువరింపఁ
బదుగు రాడిన మాటను బట్టి గాక
తాను నడిపిన బాట యర్థప్రదమ్ము

కడలి ప్రాతదె కాని యా కడలి యలల
కదలికలు నిత్యనూత్నముల్ కథల పొదలు
నేరులును నేటిపాయలు నేటి యొడ్లు
ప్రాతవే కాని పాఱు జలంబు క్రొత్త

నవత నిజముగ కవిభావనమున నున్నఁ
బ్రాత కథ యేని క్రొత్తదై పరిమళించు
నలుగురాడిన మాటల నమ్మఁ గుక్క
యాత్మవిశ్వాసదృఢతతో నదియ మేక

విభుని కొడుకుల చేపల వేట కథను
మార్చవచ్చు ముగింపులో మార్పుఁ జూపి
చివరఁ జిన్నారి పాపయుఁ జెప్పె నేని
కారణము స్వీయచేష్ట కా కథ వినూత్న

"పుట్ట లాగతి నందాల ముట్టి యుంటఁ
బట్టలేనందుకే వ్రేలు పెట్టినాను"
పాప యా మాట నేటి తాపత్రయంపు
టద్దమై సమాజపు రూపు నందుఁ జూపు

భారతకథను శల్య తత్పౌత్రి భాష
ణమ్ముతో మొదలిడినంత నవ్యగతిని
నూహ సేయంగ సాధ్యమా? యున్న దటుల
నవల పర్వాఖ్య జనహృదానందకళిక

వానప్రస్థము ధర్మ
ధ్యానోద్భవసంస్కృతి యది యద్భుత మనుచున్
దీనతగా వృద్ధాశ్రమ
యానమ్మును దెగడఁ దగునె? యది నూతనమే?

మూడుతరములఁ బెండ్లిళ్ళు మురిసి చేసె
భీష్మ డన్నియు విఫలముల్ పెను సమస్య
లచటి కారణ మేమిటో యని తలంచి
వైనముం జూప నూతనత్వమ్ము వెలుగు

మనది ఋషిపీఠసంస్కృతి ;మునులలోన
నొక్కడును కాదు సన్యాసి యూహ కేని;
సన్యసించుట ఘనమని జల్పనములు
మనవి; తత్త్వముం దీర్చుట ఘనత కవికి

పెట్టుడు రవికల ముక్కలు
తిట్టుడు వక్కపొడి భక్తి తిరుమలకన్నన్
మెట్టెక్కువ యీ పతనము
మట్టిక? మింటిక? తలంచి మనుపగఁ దగదే?

టెంకాయపిచ్చికొండల
లెంకలుగాఁ జేసికొని మలీమసనతులన్
వంకలు దిరుగుచుఁ జను నీ
వంకం జూచుచును జనులు పకపక నగరే?

ఇటు కోకొల్లలు తత్త్వపు
బటు వెఱిగిన కవికి జాతిభారము మోయన్
బటుతరమేధావిష్కృత
స్ఫుటజీవనశైలి చూపి పుడమి వెలార్పన్

లోకము గతానుగతికము
శ్లోకము శోకప్రసవ మచుంబితజనతా
లోకముగా బ్రతికినచో
నాకము నరకమును గవిజనమ్మున కగునే!

పుట్టి మఖలోనఁ బుబ్బలో గిట్టిపోవు
కథలు జాతికి నీతికిన్ గఱవుతిండి
జనగణనవలె వాటికిన్ గణన కాని
కాయకా? పండుకా? యొట్టి కలల మూట

ప్రాగ్విపశ్చిన్మతంబున వరలు కథలు
ముత్తెఱంగునఁ బ్రఖ్యాతమును రచయితృ
కల్పితమ్మును నుభయాత్మకమ్మనంగ
నందు మిశ్రమగతి గౌరవార్హ మయ్యె

అమరభాషలోఁ బద్యకావ్యములు మిశ్ర
మములు గద్యముల్ కవికల్పితములు మిగులఁ
దెలుగునం బెక్కు లనువాదములె యవైన
మిశ్రమమ్ములు బహురసోన్మేషములును

కల్పితమ్ములు ప్రాచీనకావ్యములను
దెలుగులోఁ గథాకావ్యముల్ గలవు కొన్ని
భాష భావన సంస్కృతి బహుళగతుల
ముప్పిరిం గొని వాటిలో ముద్దులొలుకు

జాతిజీవనవాహిని జాగృతమయి
ప్రతితరమ్మును దాకుఁ దీరమ్ముఁ బగిది
తరము దృఢమైన సంస్కారసరణి సాగుఁ
గామి నటు త్రుళ్ళి వక్రమార్గమునఁ బరుగు

కవికి నాపాటి సామాజికప్రవృత్తి
నిరతి సంగతి కర్తవ్యనిష్ఠ వలయు
నిసుకతో గూడు గట్టగ విసువెఱుగని
స్నేహధర్మమ్ము నార్ద్రత చెలగవలయు

నాటి జీవితమే మననాటి చరిత
నాటి యిరుల మిణుగురులే నేటి వెలుగు
చీకటి తరించు మిణుగురు చితికిపోవు
వెలుగు మాత్రమనుస్యూతి విశ్వవిహృతి

కాలగతి తట్టిలేపిన కథలవలన
జాతిసంస్కృతి చరితయు ఖ్యాతి కెక్కు
మానవీయవికాసక్రమప్రకార
గరిమ భావిని వెలిగింపఁ గలుగుఁ గరము

దర్శనము లేని వెడ కథాదర్శనమున
జేటునుం గల్గు జనతకు నోటమియగు
నట్టి యాకతాయి పనుల నిట్టు సతము
పూని జాతినెత్తినఁ బాలు వోసినట్టు

❖

కథ

అర్థవాదకథల నహరహమును పెంచి
వ్యాప్తి చేసి వ్రాయవచ్చుఁ గృతులఁ
గాని యనుభవమ్ము గన నింతయును లేని
సాహసమ్ము హితమ జాతిగతికి?

విశ్వగతసర్వవస్తువు వివిధతఁ గొనుఁ
గేవలత, నన్యసంగతికీల, గీయ
మానపదబంధరాగసంపదల వలనఁ,
గణకణమ్మున నన్యోన్యగుణకలనను

తన యునికి, దేశమును, కాలమును, తన గతిఁ
గాంచు కన్నులు, మానసగతియు, నాస,
చలనశీలత యన్నియుఁ గలసి వస్తు
తత్త్వమును గూర్చుఁ దెలియగాఁ దరమె యెల్ల

మౌఖికత సంజవేళలు మగత నిద్ర
చతురు లురుకులఁ గుక్కిమంచాలపైన
మురిసిపోయిన కథ నేడు మూగవోయె
బిక్కుబిక్కున నెక్కడో నక్కిపోయె

రచ్చబండలు దివిటీలు విచ్చుకనులు
పేదరాశి పెద్దమ్మల పెట్టుబడులు
ననగ ననగలు నూకొట్టు టంతరించి
యక్షరాకృతిఁ గథ నేటి కవతరించె

రచనపరిమాణమును బట్టి రకరకాలు
కథలు చేతనాచేతనకల్పితములు
తోటలోఁ బూలమాదిరిఁ దొంగిచూచు
గుండెలో గువ్వమాదిరిఁ గుదురుకొనును

మంచికథ పాఠకుని చిత్తమందిరమున
శిల్పమై నిల్చు ననుభూతితల్ప మగుచు
నుడులఁ బదములు వాక్యముల్ వడివడిగను
గేంద్రబిందువు వైపె సాగించుఁ బరుగు

మంచికథ యొను నిర్మాణ మంచితముగ
నప్పి నప్పుడు ;నది మారు గొప్పకథగ
నందరిని గూర్చి యారాట మందుఁ గలుగ
బిందు మాత్రంపుఁ బ్రగతియే నందుఁదోప

❖

నవల

వచనప్రబంధమనుచును
రచియించుట మొదలుపెట్టి క్రమముగ దానిన్
వచియించిరి నవల యనుచుఁ
బ్రచురమ్మది వర్తమానరచనలయందున్

పాత్రసంఖ్య, సమస్యల పరిగణనము
పరిధి, పరిమితి, నిర్మాణసరణి, హేతు
కాలబద్ధత, ప్రాసంగికతయుఁ; దీర్పు
నవల కష్టాంగహృదయ మే నాటికైన

ముక్కలతికించినట్లు సొంపులు గులుకును
గొన్ని నవలలు వ్యాపారగూఢత యది
దానితోఁ జెడు రూపసౌందర్య మసలు
గమ్యమున్ జెడు; నున్నచోఁ గవి యెడంద

నవల బహురసభరితము నవసమాజ
బింబముం బ్రతిబింబము భిన్నకాల
ములకు చరితసంస్కృతుల పెన్ మూట బాట
భావి దిక్సూచి యుత్తమాశావిభాసి

ప్రాతకథలతో నవలల వ్రాయవచ్చుఁ
బ్రథితపాత్రల కనుకృతి ప్రబలవచ్చు
వర్తమానసాంఘికసమన్వయము లేమి
ప్రగతిలాభమ్ము లేమి సర్వమును రిత్త

❖

కవితృష్ణ

ఒక పొగడిక యొక తెగడిక
యొక సత్కృతి యొక విగర్హ యొక శోధనయున్
వికృతి గలిగించినను నీ
వకలుషమతి నీ సమాజ మౌదలఁ గొనుదే?

కవితలలో నీ లోకపు
భవితను ఫలియింపఁ జేసి పదపదమున భా
వవనీమకరందము నీ
యవుగాముల యందుఁ జూప నవునే నీకున్

వైదికఋషి కౌరసుడవు
భేదమ్ములు లేని జగతి వీక్షించుటకై
సాదమె సాధనమను స
ద్వాదముఁ గొని పావుకోళ్ళ వలె సాగుదువే!

తెలియనివారిగూర్చియును తీయని మాటల నీవు పల్కుటల్
దెలియమె; యింద్రచంద్రులకుఁ దిప్పలు దెచ్చుటయున్ గ్రహింపమే
తెలియవు గాని నీవు సుకృతీ! కృతి యొక్కడె సర్వజీవభా
వలలిత మీ సమస్తమును వర్తిలఁ జేయు రసప్రకారమౌ

పుట్టంబుట్టె నొకండు పూని మునియే పూబోడినిం బ్రేముడిం
జెట్టంబట్టగఁ బుట్టె నొక్కడు సమష్టిప్రీతి నీ జాతికిం
గట్టం బెట్టిన వార లిర్వురు ననాఘ్రాతస్వలాభుల్ జగ
త్త్రివిట్టుల్ సంస్మరణీయధర్ములు కవిత్వీభూతశిక్షాస్మృతుల్

వారలసాటివాడవట వారలు సూపిన ధర్మమార్గమం
దారని పూలపందిరుల నార్ద్రతతోడుతఁ దీర్చిదిద్ది సం
చారము సేయుటే విధిగఁ జాటుచు నీవును నీ సమాజముం
జూరగొనంగఁ జాలుదువె చూపఱ నిన్ బొగడన్ గృతజ్ఞతన్

భయము సమస్తమున్ గెలుచుఁ, బాయక యుండు మనీషి నైన, నీ
పయనము దానిపై గెలుపుబాటన సాగుట, కార్యకారులౌ
వయినములన్ వచించుట యవశ్యము, వశ్యజనానురంజన
ప్రియతను దత్తృణీకృతిని వేమరుఁ జేయుట నీకు ధర్మమా?

కవితం బల్కి యసత్యముల్, ప్రకృతికిం గల్పించి వైరూప్యమున్,
ధవుడంచున్ భవుడంచు నెంచుచు ధనిన్, ధన్యున్ బ్రతారించుచున్
గవిమూర్ధన్యుడవై వెలుంగుదువు లోకమ్మంత నిన్ గొల్చినన్
స్వవచోరీతుల నంతరార్థముల నీ స్వాంతమ్మెఱుంగున్ గదా!

కరతాళధ్వనులున్ వికీర్ణసుమముల్ గల్గించునా తృప్తి? నీ
యరవిందాసనతుల్యతన్ మరచితే? యంతర్వ్యథం మెచ్చి నీ
కరుదౌ గౌరవ మిచ్చు నీ జనము నీ యారాటముల్ గాంచినం
బరిహాసమ్ములఁ జేయదే సతము బిభ్రద్భ్రామ్యదాశావృతా!

మతిఁ గ్రొత్తందన మింత తోచదు రహోమంత్రమ్ముగాఁ గృత్రిమీ
కృతమౌ భక్తియుఁ దోడు గూడు నుడులం గిట్టించి గిట్టించి వా
కృతికైనన్ పదవిభ్రమమ్ము సలుపంగా నేర్చు సంబుద్ధులన్
స్తుతులం గూర్తువు కామనల్ గెలుకుచున్ శూన్యాభ్రసంచారివై

పరివారీకృతనిత్యపండితకవిత్వస్పందనల్ తాళికా
కరభావంబులె నీకు ముఖ్యమ సరే కానిమ్ము మున్నెన్నడో
పరమస్వార్థపరాయణుం డెవడొ సంభావించి కల్పించె నీ
సరణిన్ దానిని త్రోసిరాజనగ నీషత్తైనఁ జింతింపవే?

విభులను జేరి కొల్చి దినవెచ్చములం గొని బొజ్జ నింపి యా
విభులనె దూలనాడుటను భేషనుచుందువు గాని యేటికా
సభలును, తిండిగింజ లనఁ జాలవు; చిత్తము చచ్చిపోయెనా?
యభిమతి మందగించినద? యా బ్రతు కంత రుచించుచున్నదా?

రాజుల ప్రాపుతో బ్రతుకు; రాచరికమ్మనె తూలనాడుటల్
హా! జనమాన్య లీ సుకవు; లైనను మీకిడె గౌరవమ్ము నా
రాజు; తదీయమానసమె రమ్యము; దాని నెఱుంగలేక యే
యోజఁ గవిన్ నుతించుట యహోస్థిరచిత్తునిగా మనస్విగా

రమణీప్రియదూతిక నీ
కమరింపన్ వలెన విడియ మది లేనియెడన్
గమనీయకవిత పుట్టద?
యమనసనిశి యంత మాత్ర మైనఁ బొడమదా?

శాస్త్రి శర్మ కలిసి సరదాల పరదాల
నవ్వు పుట్టఁ జేసినారు నుతుల
మర్మ మదియె నాటి మాయాబజారులో
వారి మించి పోవవలెన నీవు?

మన కొలది మన మెరుంగమ?
వినుకలి కనుకలియు లేవ? విలువలఁ గనమా?
వినరాని బిరుదుపదములఁ
గొని చిందులు వేయు పిచ్చి కోరిక సబబా?

బిరుదపదమన్న జంకవ?
బరువెరుగవ? పరువు గనవ? పదుగురిలోనన్?
దరమా?సరళమ్ముల వలె
బరుషమ్ముల నైనఁ గొనుట పరు వనుకొనుటల్

అభినవులై యభినవులై
యభినవపూర్వార్ధపదసమాశ్రయచణులై
స్వభవమ్ముం గోల్పోవుట
యభవుండున్ మెచ్చబోవునా? కవిగణ్యా!

బిరుదపదములు సిగ్గిలి బెదరి చెదరి
దిక్కులంబట్టి పోయినన్ నక్కి నక్కి
యొడిసిపట్టెద వౌర! కావడిని నింపి
మోయుచుందువు భుజముల గాయమైన

నీ కవితాలోకమ్మును
నాకధునీతోయవిహరణమ్ములె గానీ
శోకాకులజనవితరణ
తాకద? యది బుగ్గచుక్క? తనివి నొసగదా?

నీ కరముల్ పదమ్ములు పనిం గనఁ జాలిన సౌఖ్యసంపదల్
చేకుఱు గాదె తృప్తి; యెదొ చేపును దా నని యన్యు నెవ్వనో
యే కృత ముబ్బె నంచు నుతియింతువు? యా కలవాని పాటి సు
శ్లోకుడు లోకజీవనుడు లోకులలో నొకడేని తోచడా?

వాఙ్మయమ్మును గుప్పతెప్పలుగఁ బోసి
తగవు వినువారు లేరని తలచెఁ దుదకు
వ్యాసుడును; నీవు నట్లు సుభాషితములె
పలుకుచుండిన విని చేయువార లెవరు?

తాను తరియించినను గాదె తన పలుకులఁ
బరులఁ దరియింపఁ జేయుట; పలుకు పలుకు
నందు పరజనబోధయే యమరుఁ గాని
నైజగుణగణనిర్మాణనయము వలదె!

కంచిపూలమాలకయి కాళహస్తిలోఁ
దలను వంచి తనిసి తరలు వాడ
యింత ప్రాకులాట లేల? నీ కతమున
తలను దించుకొనగవలసె జాతి.

క్రొత్తబండికి బూజల కొలుపు దీర్చి
కట్టబెట్టిన పుట్టంపుఁ గళఁ జెలంగు
శాలువాలు ,సభల లోని వాలు చాలు
పతనమైనట్టి మనజాతి పసఁ దెలుపగ

ఒకపరి సన్మానములట
నొకపరి సత్కృతులు నిచట నౌకరికి నౌకరై;
వికలత ద్రష్టృజనావళి
కకటా! యిదియేటి యాట యమఁ జీకటిలో

నాల్గు పుంజీల గింజల నానఁ బెట్టి
యనువుగాఁ దోచినప్డు రుబ్బిన విధాన
నాల్గు కైతలఁ గెలికి విన్నాణ మనుచు
వినిచి వేమరు మురియుట విధికృతమ్మె

కవివర్యులు కవిచంద్రులు
కవివృషభులు సుకవివరులు కవిశేఖరులున్
భువి నెగడుట సౌభాగ్యమె..
కవు లెచ్చటి కేగినా రకట! బ్రతుకుటకై!

అతివినయ మ్మవసరమా?
యతిశయముగఁ బొగడివేయు టవసరమా? యౌ
చితి నెఱుగవ? త్రాసునఁ దూ
చితి వనిపించువిధమున వచింపగ సిగ్గా?

వినిపించుటయే గానీ
వినుటన్నన్ మది చిరాక? విను ధాతువుపై
జనియించద కర్త్రర్థము?
పని ప్రేరణమాత్రమగున పదశాస్త్రమునన్?

జన్మదినపంచరత్నముల్ జాతకర్మ
పంచరత్నముల్ కళ్యాణపంచరత్న
ములును లెక్కలలోఁ జేరి మురియుచుండుఁ
దమి శతాధికగ్రంథకర్తలకుఁ; దలకు!

మనముం గందగనీక యాశలకు నే మాత్రం బసౌకర్యముం
గనగా నోపక శిష్యభృత్యవితతిం గల్పించు కొంటొక్కడే
ఘనతాహేతువుగాఁ దలంచి సత ముద్గాత్రుండవై పాత్రతా
ధ్వనిరాసక్తుడవై మెలంగుదువె! విత్తన్యస్తచిత్తుండవై

తుల యెందైనను లేని శబ్దములు సత్తుల్ చిత్తు లున్మత్త నీ
తెలువుల్ మిక్కుట మౌటఁ గృత్రిమములై తెల్లంటులై నిల్చి కై
తల నృత్యంబులఁ జేయుచుండు నకటా! తత్త్వార్థసంవేత్తృతా
కలనంబుల్ నిజసత్కృతిప్రియములా? కాలం బనాలంబమా?

నన్నుఁ బిలువవలదు నాకు లేదాసక్తి
యని విరుద్ధలక్షణను గొని యని
కుతిని వేదికలను కొలువు గోరెడి కర్మ
కామ్యకర్మ నిత్యకర్మ యాయె

కవినిష్ఠ

అవునా? నిన్నటివాడవా? కఱకువా? యంతంతమాత్రానికే
వివరింపా? యెదిరింపు లేద? భయమా? విశ్వాసరాహిత్యమా?
కవివే! స్వేచ్ఛ నెరుంగవా? నిరతమున్ గళ్యాణసౌందర్యసం
భవకావ్యామృతభావనామధురసంపత్సిద్ధి నందింపవా?

కవిగాఁ బుట్టితివా? జనించి కవి గాఁ గాంక్షించినావా? సహో
ద్భవపాథశ్చరఖేచరాదుల మనస్తత్త్వంబు సత్త్వంబు నీ
కవునా గౌరవదృష్టితోఁ గనుట యాప్యాయంబుగా జూచుటల్
నవతేజంబు నొసంగుటల్ గొనుటలున్ లక్ష్యంబు ఛేదించుటల్

అవలీలన్ బలికింపఁ జాలుదువు పద్యంబుల్ రసంబుల్ కవి
త్వవిశేషంబులు ఛాందసుండవయి; సత్యప్రేమ సౌందర్యముల్
స్తవనీయంబులు గానిచో సుకవితాసామ్రాజ్యముల్ వ్యర్థముల్
సువచఃప్రీతినిధానమాత్రగతులున్ శూన్యాభ్రసంకేతముల్

సవనంబొక్కొక పద్యమున్ నిఖిలవిశ్వప్రాణిసౌజన్యసం
భవమౌ నైజమనోగతిప్రకటమౌ భాషావిశేషప్రభా
వవికీర్ణంబయి; కావునన్ బ్రజకు మేల్ వల్లించుటే సత్కవి
ప్రవరోద్యోగము తాదృగధ్వగతివై వర్తిల్లుదే నిచ్చలున్

సవరింపందగు సంస్కృతిన్ నడవడిం జైతన్యమున్ దైన్యమున్
బవమానత్వర సంస్కరించుటను సంభావించి వాగ్రూపకై
రవముల్ నల్గడఁ జల్లుచున్ జనహృదారామంబు నీ ధామమై
నవతల్ మానవతల్ వెలార్పగ జగన్నాథుండవై నిల్చుదే

అనిదంపూర్వమ నీదు వేదన వృథాయాసప్రయాణమ్మ జీ
వనరంగస్థలి సర్వజాతిగతిసంపన్నంబె మన్నించి దా
నిని నానందపథమ్ములో హృదయతన్త్రీభూతసంవేదనాం
గణమందున్ నిరతమ్ము సంచరణమున్ గావింపగా నయ్యెడిన్

చివురుల్ వుట్టినఁ బండుటాకు గదలన్ జేమోద్పు లందించి, పా
యవు వాటిన్ విడి, చెంగటన్ నిలిచి కాయల్ పూల లెక్కించుచుం
దువె యేదో యెద సుంత దోచిన నదే తూర్పారగాఁ బట్టుచుం
దువు కైతల్ మొగమోడు మాటల? యలంతుల్ మెచ్చు పూదోటలా?

ఒకటో రెండొ మరొొక్కటో కెలికి యెంతో...వ్రాసి నట్లెంచి తీ
రికగా నెల్లర ముందు విన్చి సరియేరీ నాకు నానెంచి చీ
లికలుం బేలికలైన మాటలను వల్లింపంగ నీకేల? యిం
చుక యోర్మిం దలపెట్టినం బసిడి యచ్చుల్ దీసి యందింపవే

గుబులుం గూర్మలు గుండెలం గలిగినన్ గొంగ్రొత్త తాకిళ్ళతో
సొబగుల్ దీర్చుచు జాతినిప్పులపయిన్ జూపుల్ పిసాళించుచున్
సబబుల్ వల్కగఁ జాలు తెల్వి గల నీ సాయమ్ము లెవ్వారికై
నఁ బవల్ రేలును గోరఁగాఁ దగిన వైనం జాలుగా కూర్పరీ!

కలగుండ్లున్ వడగళ్ళు గళ్ళు నలుమంగా సుంత యోదార్పు ర
చ్చలు రావిళ్ళు కలంకులున్ గలతలున్ జాకింటి పుట్టంబు లౌ
టలవాటే గద నిచ్చలున్ బ్రతుకులో నంచున్ నిదానించి నీ
విలఁ ద్రుళ్ళింతల నీదు రాబడి యొకండే లెస్సగాఁ జూచుదే!

కనులం జెమ్మ యెదందలో గుబులుతో గాన్పింపగా నెవ్వ డే
ననువౌ తీరునఁ జెంతఁ జేర్చి వగతో నాడంగ నీదౌ యెదన్
గనగా వచ్చునె ప్రేముడుల్ వెఱపుఁ బోకార్పంగ నా గుండెలో
తనువుల్ గూర్చుచు మొక్కలమ్ము గఱుపన్ దాల్మిన్ గనన్ దిట్టవే?

కాలము జాలముం గుదుపఁ గల్గిన శీలముతో నిరంతరా
భీలతరాగ్నిసంపుటు లవేలముగాఁ జెలరేగినన్ దుధు
క్షాలయకారివై రసజగత్తు నవక్రపరిక్రమక్రమా
కీలితరమ్యభావపరికీర్ణముఁ జేయ నెదం దలంతువే?

అతులకళాతపస్య హృదయంబునఁ బూచిన భావపుష్పసం
తతుల సమాజతర్పణమె ధర్మముగా గ్రహియించి శాశ్వత
స్థితి నవిభాజ్యరూపరసచేతనలన్ వెలయింపఁ జేయగా
న్మతి నొకయింత యేని మననమ్ము జనమ్మునఁ గూర్పనేర్తువే!

నీ కైతల్ విని పాఠకుల్ గనులలో నింపంగఁ గన్నీరు నీ
వా కన్నీటిఁ బణంబు సేసి జగమం దాచంద్రతారార్కకీ
ర్త్యాకారప్రియశిల్పసాధనలకై యారాటముల్ మాని యీ
లోకశ్రేయమె యక్షరాక్షరము లోలో గూర్ప యత్నింతువే!

కవితాధర్మము లోకధర్మమె జగత్కళ్యాణసంక్రాంతిసం
భవమే తత్ఫల; మీ రహస్యము మనోఽభ్రభ్రామ్యదాశారహ
స్యభవోద్రేకముఁ బో నడంప ఋషివై యాశంసివై శంసివై
జవమై సత్త్వమునై సమాజరవివై సచ్ఛ్రేయమై సాగుదే

కవివై కల్పన లుప్పతిల్లు కవితల్ కల్పించి సంభావనో
ద్భవసౌందర్యరసాధిదేవతల సౌభాగ్యంబె రక్షించుచున్
స్తవనీయంబుల సత్యసత్త్వముల దోశ్శక్తిన్ బ్రతారింప నీ
కవునా? నేర్వవ నేలపై నడవగా నానాకసంచారివై

పనిచేయుటలోఁ బరమా
త్మను గని విశ్వమ్ము నంతఁ దద్రూపముగా
గొని సామాజికసేవా
ఘనమతి నుతియించి నిల్వఁగా నీ కగునే!

మేధావిన్ నినుఁ జేసె నమ్మి నిను నీ మేధావిశేషక్రియా
సాధీయస్త్వము సర్వజీవహితమున్ సాధింపగా బ్రహ్మ యా
బోధల్ సేయగ నెన్నె నిన్నె మరి నీవున్ దాని మన్నించి నీ
వేధస్త్వమ్ముఁ గవిత్వమున్ విధికృతోర్వీకల్పముం జేయుదే?

ప్రతిభ విభిన్న హేతువు స్వభావ పరిక్రమ జాత జీవన
స్థితి యది తారతమ్యములు చెల్లెడు నందున నీకు నేరికిన్
మితిని నిజాయితీ కలిగి నీమముతో జనజీవనమ్ముతో
యుతి గని సర్వభూతహితయోజ మెలంగుట నీకుఁ గర్జమౌ

ప్రతిభ యొకింత గల్గినను వ్రాయగవచ్చు మహాకవిత్వ మ
ద్భుతముగ దాననేమి? వినుతుల్ వినతుల్ ప్రణతుల్ ప్రకీర్ణముల్
మతి పెడ లాగినన్ ధిషణ మాత్రమె చచ్చుట కాదు నీదు జా
గృతియు నశించు జాతియును గీటడగున్ దయనీయజన్మమై

కవి మనీషి స్వయంభువు క్రాంతదర్శి
కవి జిగీషువు ధిత్సువు కాంతదర్శి
విశ్వతేజోనురక్తి సంవిష్టధిషణు
డౌట మోమోటముల కేల ఆత్రపడుట?

కవిత వ్రాయకున్నఁ గలుగ దధర్మమ్ము
వ్యాధి లేదు శిక్షపడుట లేదు
వ్రాసి నంతమేర వైనముగా నున్న
చాలు జగతి కదియె వాలు వీలు

అవునన్నం గాదన్నం
గవిపదవాచ్యుడవు నీవు గద! జ్ఞానము నీ
దవు కర్తవ్యము తెలుపద?
కవలే గద రసము హితము కవితోద్గతిలోన్

వ్యాసు డొక్కడు తప్ప సర్వమును గూర్చి
మౌనముగ నిష్క్రమించిన మహితు డేడి?
తా శతాధిక గ్రంథకృత్తా? సహస్ర
కృతివినిర్మాతయా? బాపురే! తపస్య..

బుల్లి బుల్లి శ్లోకమ్ములు; కల్లబొల్లి
కల్పనలు లేవు; సత్యసంఘర్షణమ్మె
కథ; స్వభావనిర్వహణమె కథన; మొకటె
వ్రాసి మురిపించె వాల్మీకి రామగాథ

గుండె ప్రిదల వెడలి, గుండె గుండెను దాకి,
యండ గాగ నిలిచి కొండవోలె
నొక్క మదికి నైన నోదార్పు నిడఁ జాలు
నొక్క కృతియ చాలదో? మనస్వి!

ఒకహాలుం డొక యమరుకు
డొక భారవి యొక మయూరు డొక శ్రీహర్షుం
డొక మాఘుం డొక శూద్రకు
డకటా! యొక దశక మైన నమరిచిరె కృతుల్?

శృంగారమ్మును రంగరించు పనిలో శ్రీమన్మహారాజువై
యంగాంగంబుల సంచరించుదువు నీ వానందరూపీభవత్
సంగంబయ్యది భావిజాతినియతిన్ సాధించు యోగంబు గా
గం గాంచంగ నెఱింగినన్ జనహితాగ్రస్థాన మీవందవే.

అవధుల్ గానగరాని చిత్తముల నాప్యాయప్రమాణంబు జీ
వవిధానేకతఁ జూచి తద్గతమహత్త్వంబున్ సమర్చించి త
ద్భవనైశిత్యము నీ యెడందఁ గనులం దాదాత్మ్యముం బొందినన్
గవనైకప్రియతన్ జగద్ధితకృతిన్ హృద్వీథులం దూగవే

పరమామ్నాయము భారతీయగురుతాభ్రచ్ఛన్నధర్మంబు సం
కరమై కింకరభావమే యెడదలం గల్పింపఁ గాఁ జాలె నీ
కరిజాడ్యంబు దొలంగఁ జేయుటకునై కర్తవ్యనిష్ఠాగరి
ష్ఠరుచిన్ బూని విచక్షణేక్షణమతిస్వాదిష్ఠతం గూర్పవే!

కాలమునకు దైవమునకుఁ గర్మమునకు
ధర్మమునకు సత్యమునకుఁ దత్త్వమునకు
శ్రమకు స్వేదమునకు సమాజమ్మునకును
దలను వంచగ వలెను; దండలకుఁ గాదు

కవులు చే చాపుటల నాపఁ గలిగినారు
కొంత మేర; నదేమిటో వింత! యొరులు
గానవచ్చినం జాలును గాలు సాపు
టలవడినది మహాత్ములై యలసినంత

శాస్త్రహీనులఁ గవులని చాటిరపుడు,
కవితయందును హీనులై కదిలి రిపుడు
ప్రవచనమ్ములఁ జేయ, రేపటికి భూత
మంత్ర తంత్ర యంత్రమ్ములె మదుపు లేమొ?

శ్రీవిద్య కైతలోఁ జెడుగుడు లాడునే
యద్వైతతత్త్వమ్ము నదిరిపడునె
కుండలినీశక్తి కూటమిఁ గట్టునే
యోగవిద్యయు నైజయోగ మనునె

పాశుపతమ్మను ద్వైతమ్ము కాపాలి
కమ్ము శాక్తేయమ్ము సౌమ్ము లగునె
తగ విశిష్టాద్వైతతత్త్వమ్ము తగిలెడు
నే రెండిటికి భేద మెఱుగ లేవు

దాన నొకమాట నొకమాట దీనినుండి
పీకి పెనవేసి భక్తిలో పిసికి పిసికి
తొలుత నోంశ్రీల నొక్కటి నిలుపుచుందు
వేటి యాతన? బ్రతుకన్న నేటి యాట?

విశ్వాసముఁ బ్రశ్నింపకు
విశ్వాసనటనలఁ బ్రశ్న వేయక విడ ; కా
శాశ్వాసము మరువకు మే
ధాశ్వసనముఁ గోలుపోకు ధన్యతఁ గనగాన్.

ఎఱుక వందనీయమే, యెఱుగమి యైన
మాన్యమే; యెఱింగి మౌన మూన,
నెఱిగినట్లు సర్వ మేర్పడఁ బల్కిన
నెట్లు హితకరమ్మొ యేరికైన?

తర్కసహమైనచో నర్థతస్కరణము
యుక్తమే గాని భావనోద్రిక్తకవిత
నైజమేధాజయోజనాతేజమునకె
మోజువడఁ దగు నుచ్ఛిష్టములకు గాదు

నీ నడకలు పదశక్తులు
నీ నటనలు నిటలనేత్రనికటాటనముల్
నీ నీతులు ప్రాగ్జ్యోతులు
నీ నిర్మలవర్తనములె నిధులు జగతికిన్

మనిషి శిల గాదు శిలఁ జెక్కెడు నులి గాదు
సమత రెండింటఁ బొసగు ఘర్షణయుఁ గాదు
కాలజాలమ్మునం జిక్కి కరగి కలగి
వెలికిఁ దనయంత వచ్చిన యులికిపాటు...

ఉలికిపాటున కూపిరు లూదుఁ బ్రకృతి
చవులు నిడుముడుల్ పెనగొని తవులు దాని
లోక మొక్కటి చేతనాలోక మొకటి
స్వప్నగాలోక మొకటిగా సాగు నద్ది...

క్షణికమైనను నక్షయ్య మనెడి వగయు
నక్షయమ్మైన నశ్వర మనెడి భయము
చెలగి కలనేతయై నిల్చి చెదురు మదురు
చినుకువలెఁ దడిపొడి చేయు జీవితమ్ము...

తడియుఁ బొడియును వేరుగాఁ దలపరాని
ప్రౌఢమధురిమ సామ్యభావంబునందుఁ
దలపు లల్లిన సత్కళాకలికలందు
సాగు నది సుధీహృదయవిశ్రాంతిపదము

చీకటికి వెన్నెలలు వెల్ల సిరుల మూట
యాకటికిఁ గైతతునుకల యందఁజేత
కవికిఁ జెల్లును సౌజన్యపవి యతండు
కాలగతి మార్చగాఁ గల్గు కారుణికుడు

ఆకారితపీయూషస
మాకలితమ్మైన దివ్యమాధుర్యఝరీ
శ్రీకారము సత్కవితా
ప్రాకారము భావుకత్వపాశము కవికిన్

గాటముగ భావ మొక్కడు నాటెనేని
యతికరించుచు నౌచిత్యమైనఁ గాని
జాతిఁ బాటింపఁజేయగాఁ జాలియుంటఁ
గవికి సద్భావనానిష్ఠ యవసరమ్ము

పాలకుడు బాట మార్చినన్ బట్టి చూపఁ
బాలితుడు దారితప్పినఁ జాలు చూపఁ
గవియె చైతన్యమూర్తియై కదలవలయు
బడబయై వేడిచలువలఁ బాడవలయు

పెద్దమాటలు పలుకుచుఁ బెత్తనాలు
చేసినన్ గాదు ములుగఱ్ఱ చేతఁ బట్టి
యాత్మశుద్ధినిఁ జతచేసి యహరహమ్ము
నడపవలె సమాజమ్ము సంస్థాఫలమ్ము

తూర్ణనిర్ఝరుల్ కల్లోలతోయనిధులు
క్రూరజంతువుల్ గాఢతుషారతతులు
నారురుక్షుత్రిశంకుమార్గానుగతులు
కవుల కడ నిల్చు నాగును గరగుఁ గృపను

ఒక కవికి నర్థమందున
నొక కవికిం గీర్తి యందు నొకనికి నుతులం
దొకనికిఁ బ్రచారమున నే
యొకడికొ కర్తవ్యనిష్ఠ యుండును గవిగా

కవితలంపు విలక్షమై క్రాలుచుండు
నాకె కనఁజాలు నొక కవి యాకులోని
యీనెలనొకండు నీనెలలోని జిలుగు
రేకల నొకండుఁ బత్రహారిత మొకండు

కదలిక నొకండు గదలిక కతనఁ గలుగు
చిఱుతగాలి నొక్కడుఁ జింతఁ జివికి చివికి
యిలను వ్రాలిన పండుటాకుల నొకండు
దానఁ బొడసూపు నశ్వరత్వమ్ము నొకడు

రేపకడఁ జివురెత్తిన రూపొకండు
రూపుపయి బాలభానుని చూపొకండు
కాంతివలయమ్ము నొక్కడు కదలి కదలి
కవితగా మారు నొక్కడు క్రాంతదృష్టి

తన మహోన్నతభావన తన చికీర్ష
తన సమాజహితోక్తియ తన వివక్ష
తన వినిర్మాణదీక్షయే తన రిరక్ష
తన జగన్నేతృసృష్టియే తన జిగీష

ఒరులు పలికిన పలుకుల కూ యనంగ
వలను పడకున్నఁ బోనిమ్ము కలతపడకు
నీవు పల్కిన మాటల కీవె సుంత
కట్టువడకున్న క్షమియింపఁ గలదె జగము

❖

ఉపసంహారం

ఎంతటి మహాకవికి నేని సుంత దొసగు
దొరలవచ్చును నిర్మాణసరణియందు
నింక మాదృశసామాన్య డంకెగొనునె
భావభాషాకవిత్వసంప్రైషములను

ఒరులడిగినఁ జెప్పనిచో
నరకమ్మునఁ బడు నటంచు నన్నయ వలికెన్
బరులడుగకున్నఁ జెప్పినఁ
బరిణతి ఫలమేమి యగునొ? పలికితి నైనన్

ఎవని యాలోచనమ్మని యెప్పుడో యొ
కప్పు డుపయోగపడు లోక మొప్పఁగలుగుఁ
గాన నెవ్వరి భావన లేని యిందు
దాచఁ బడవలె జనహితాధ్మాతమతిని

ఏదొ మొదలిడి యెక్కడో చేది చేది
కొన్నిచుక్కల నిక్కడఁ గురిసినాడ
దప్పిఁ దీర్చునో యెదచేలఁ గుప్పఁ దీర్చు
నో తెలుపవలె రేపొ మాపో జనమ్మె

ధర్మబద్ధత ప్రగతికి దారి; ప్రగతి
కరణశీలతవలననే కలుగుఁ; బనుల
మాని కేవలదైవసంభావనమున
శాంతి విచికిత్సితమ్మె విభ్రాంతి ఘనము

❖❖❖

కవి పరిచయం

డా. సూరం శ్రీనివాసులు

జననం	:	03-06-1951, నెల్లూరు
తల్లిదండ్రులు	:	కడయింటి శేషమ్మ, సూరం హనుమంతయ్య
విద్యాభ్యాసం	:	20 సం॥ వయస్సు వరకు నెల్లూరులోనే
ప్రాథమిక విద్య	:	1-3 తరగతి ఎయిడెడ్ ఎలిమెంటరీ స్కూల్, అత్తితోట అగ్రహారం 4-5 తరగతి ఎయిడెడ్ ఎలిమెంటరీ స్కూల్, ఉస్మాన్ సాహెబ్ పేట
ఉన్నత విద్య	:	6-8 తరగతి - వి.ఆర్. హైస్కూల్ 9-ఎస్.ఎస్.ఎల్.సి. - వేద సంస్కృత పాఠశాల - 1967, మూలపేట
కళాశాల విద్య	:	సాహిత్య శిరోమణి, వేద సంస్కృత పాఠశాల – 1967, మూలపేట (శ్రీ వేంకటేశ్వర విశ్వవిద్యాలయ ప్రథమస్థానం)
ప్రైవేటుగా	:	పి.ఒ.ఎల్. 1975, ఆంధ్ర విశ్వకళా పరిషత్, వాల్తేరు. భాషా ప్రవీణ 1976, ఆంధ్ర విశ్వకళా పరిషత్, వాల్తేరు. ఎమ్.ఎ. (సంస్కృతం) 1977, ఆంధ్ర విశ్వకళా పరిషత్, వాల్తేరు. ఎమ్.ఎ. తెలుగు 1978, ఆంధ్ర విశ్వకళా పరిషత్, వాల్తేరు. వాల్తేరు. పి. హెచ్.డి. 1986, ఆంధ్ర విశ్వకళా పరిషత్ వాల్తేరు.
ఉద్యోగం	:	1971 - 1972, ఎన్.వి.ఎస్.ఓ.ఎన్. స్కూల్, చేకూరపాడు, ప్రకాశం జిల్లా.
లెక్చరర్	:	1972 - 1976, ఓరియంటల్ కాలేజ్, ఏలూరు & ఓరియంటల్ కాలేజీ, చిననిండ్రకొలను. 1976 - 1980, ఓరియంటల్ కాలేజీ, పొన్నూరు.
ప్రిన్సిపల్	:	1980-1990, ఓరియంటల్ కాలేజీ, తాడికొండ. 1990-2009, ఓరియంటల్ కాలేజీ, తిమ్మసముద్రం
పార్ట్ టైమ్ లెక్చరర్	:	ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం (1 సంవత్సరం)

Visiting Fellow : రాష్ట్రీయ సంస్కృత విద్యాపీఠం, తిరుపతి. (2008-09)

Adjudicator : For Several Dessertations Submitted for Ph.D

పురస్కారాలు : - ఆంధ్ర ప్రదేశ్ సాహిత్య అకాడమీ ఉత్తమ గ్రంథం
బహుమతి - 1979 'సంస్కృత భాణ సాహిత్య' గ్రంథం
- ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వంచే ఉత్తమాధ్యాపక బహుమతి-1981
- తెలుగు వెలుగులు - శ్రీనాథపీఠం-1987
- పుష్పకిరీట సన్మానం, చెన్నై
- ఉగాది సాహితీ పురస్కారం, లలితకళా పరిషత్, చీరాల-2001
- బహుముఖ ప్రజ్ఞ పురస్కారం, సహజ సాహితి, చీరాల-2009
- సి.పి.బ్రౌన్ సాహితీసేవాపురస్కారం, బెంగుళూరు - 2020 నవంబర్
- 1970 విద్యార్థి దశ నుండి వివిధ ప్రాంతాలలో అవధాన సభలలో
సన్మానాలు, బిరుద ప్రదానాలు.

వృత్తిపరంగా నిర్వహించిన బాధ్యతలు

1. Member, Academic Council, Acharya Nagarjuna University.
2. Member, Academic Senate, Acharya Nagarjuna University.
3. Member, Board of Studies in Oriental Languages, Aharya Nagarjuna University.
4. Adhoc PG Board of Studies (Sanskrit), Acharya Nagarjuna University.
5. Person, Refresher Courses
6. P.R.O., Oriental College, Resource Teachers Association (AP)

ప్రచురణలు

1. సౌమనస్యము (ఖండకావ్యం - పద్యం) - 1979
2. సున్నితపుత్రాసు (వచనకవితాసంకలనం) - 2002
3. సంస్కృతభాణసాహిత్యము (విమర్శ)
(ఆంధ్రప్రదేశ్ సాహిత్య అకాడమీ బహూమతి 1979)
4. సంస్కృతప్రహసనసాహిత్యం (విమర్శ) - 1986
5. Hasya and Prahasana: A Critical Study (Ph.D..thesis) - 1989
6. మత్తవిలాసప్రహసనము - తెలుగు అనువాదం - 1974

7. పూజాకుసుమమ్.   (రేడియో నాటకం..సంస్కృతం) - 1987
8. కరావలంబమ్.   (॥   ॥   ) - 1985
9. ధూర్తానుభవభాణః   (సంస్కృతం)
10. గురువరరంజనభాణః   (॥   )
11. కవిజనమండనభాణః   (॥   )
12. నటసమాగమభాణః   (॥   )
13. నికష (విశ్వధర్మవాణి మాసపత్రిక సంపాదకుడుగా వ్రాసిన
    సంపాదకీయాల సంకలనం) - 2009
14. రుక్మిణీశవిజయమ్ (సంస్కృతమహాకావ్యానికి విస్తృతంగా తెలుగు వ్యాఖ్య)
15. భవానీ భారతి (అరవిందుని సంస్కృతకావ్యానికి తెలుగు వ్యాఖ్య) - 2019
16. దశావతారస్తోత్రమ్ (వాదిరాజతీర్థరు రచనకు తెలుగువ్యాఖ్య) - 2019
17. శివానందలహరికి జ్యోతిష్మతీ వ్యాఖ్య
    (సంస్కృతంలోనే - వ్యాకరణవిశేషప్రస్తావనతో) - 2020
18. రాధాషోడశ నామస్తోత్రం (అర్థతాత్పర్యాలు) - 2020
19. కుమారసంభవమ్(కాళిదాసరచితమ్) (అష్టమసర్గ - తెలుగులో వ్యాఖ్య) - 2021
20. ధాతృప్రశ్నః అథవా వేదాన్తమణ్డనమ్ - 2021
21. స్థావరజంగమం (వచనకవితాగీత) - 2021
22. ఏటివాలు జ్ఞాపకం (వచనకవితాసంపుటి) - 2022
23. భారతనిరుక్తి - నన్నయరుచిరార్థసూక్తి - 1983
24. భారతనిరుక్తి - తిక్కన సరసోక్తి
25. భారతనిరుక్తి - ఎఱ్ఱన ధర్మోక్తి
26. జనహిత వ్యాఖ్య (ఆంధ్రమహాభారతము - విరాటపర్వము) - 1989
27. జనహితవ్యాఖ్య (ఆంధ్రమహాభారతము - ఉద్యోగపర్వము) - 2000
28. జనహితవ్యాఖ్య (నిర్వచనోత్తరరామాయణము - తిక్కన) - 2005
29. వ్యాసమహాభారతం - తెలుగువచనం - 2010
    (వ్యాసభారతానికియథాతథానువాదం) 20 సంపుటాలు (6000 పుటలు)
30. మహాభారతము – తెలుగు (మూలం..అనువాదం..విశేషాంశాలు..గీతాప్రెస్..
    గోరఖ్ పూర్ ప్రచురణ) A4 సైజులో.. 7 సంపుటాలు..7250 పుటలు - 2018
31. శ్రీమహాభారతము(సంస్కృతం) విరాటపర్వము
    (జనహితవ్యాఖ్య - తెలుగులో - గీతాప్రెస్, గోరఖ్‌పూర్ ప్రచురణ) 2005

(23 - 31 గ్రంథాలకు సహరచయిత డా॥ తిప్పాభట్ల రామకృష్ణమూర్తి)

ఇతరాలు:

1973 నుండి ఆకాశవాణి ద్వారా సంస్కృత పాఠాలు, సంస్కృత ప్రసంగాలు కథలు, ఏక పాత్రలు, సూక్తి సుధ, సద్వాణి, తెలుగు సాహిత్య ప్రసంగాలు -

1973 నుండి జాగృతి, భారతి, నాట్యకళ, ఆంధ్రపత్రిక, ఆంధ్రప్రభ, రచన, సమాలోచనమ్, గైర్వాణి, సుధర్మా, ఆత్మజ్యోతి, సంవిత్, సంస్కృత సమ్మేళనమ్ మొదలైన పత్రికలలో వచన కవితలు, విమర్శ వ్యాసాలు, శ్లోకాలు, నాటికలు ముద్రితాలు, బొమ్మలకొలువు - అసంపూర్ణ నవల - విద్యాజ్యోతిలో సీరియల్

1991 నుండి 'విశ్వ ధర్మ వాణి' పత్రికా సంపాదకత్వం

కుటుంబ వివరాలు:

శ్రీమతి : సులోచన

కుమార్తెలు : 1. మాధవి, BE (Hons) M.S

అల్లుడు : కావూరి శ్యామ్ సుందర్

మనవడు : శ్రీహర్ష

మనవరాలు : గాయత్రి

2. డా॥ సుషమ., M.B.B.S., D.O

అల్లుడు : డా॥ ప్రవీణ్ కుమార్

మనవరాలు : వాహిని

అభీష్ట విషయాలు : 1. అధ్యయనం, అధ్యాపనం

2. ఆధ్యాత్మిక, అది భౌతిక జీవితాల మధ్య సమన్వయాన్ని సాధించేందుకు అనుగుణంగా విశ్లేషణాత్మక పరిశీలన

3. ఆచరణ ప్రాధాన్యం